మంత్రులను కలిసిన ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును, కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డిని వేరువేరుగా వారి నివాసాలకు వెళ్లి కలిశారు. నర్సాపూర్ నియోజకవర్గం అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించాలని మంత్రుల ను కలిసినట్లు ఎమ్మెల్యే మదన్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్, హత్నూర జెడ్పీటీసీ ఆంజనేయులు, శివంపేట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రమణగౌడ్ తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ 1



మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

సోమవారం 23 జనవరి 2023

ఆర్థిక సహాయం చేసిన స్నేహితులు



నవతెలంగాణ-కౌడిపల్లి

స్నేహితుడు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందడంతో తోటి మిత్రులు అతని కుటుంబానికి ఆదివారం రూ.లక్ష ఆర్థిక సహాయం చేసి ఆదుకున్నారు. మండలంలోని సలాబత్‌పూర్ తండాలోని స్నేహితుడు సురేందర్‌నాయక్ కుటుంబాన్ని పరామర్శించారు. సురేందర్ నాయక్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌడిపల్లి కోఆప్షన్ నెంబర్ హైమద్ తోపాటు చిన్ననాటి స్నేహితులు పాల్గొన్నారు

పండరిపూర్ వరకు పాదయాత్ర



నవతెలంగాణ-మనూర్

మహారాష్ట్రలోని పందరిపూర్ పుణ్యక్షేత్రానికి భక్తులు పాదయాత్రగా వెళారు. మనూరు, నాగల్గిద్ద మండలాల పరిధిలోని గ్రామాల భక్తులు ప్రతి సంవత్సరం భక్తులు పాదయాత్రగా పండరీపూర్ వెళ్తారు. ఆదివారం పాదయాత్రను గజేంద్ర కరణ్ మహారాజ్ ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలోపాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ

ఆదర్శంగా నిలుస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-నారాయణఖేడ్

నారాయణఖేడ్ మండలం రేఖల గ్రామ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ ఆచార్య, ఉపాధ్యాయుల బృందం ప్రతి ఆదివారం స్పోకెన్ ఇంగ్లిష్‌లో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. సంక్రాంతి సెలవు దినాలలో విద్యార్థులకు బోధన అందించారు. ఉపాధ్యాయుల కృషిని చూసి తల్లిదండ్రులు, వివిధ సంఘాల నాయకులు అభినందిస్తున్నారు. వీరు చేస్తున్న కార్యక్రమాలు మరిన్ని ప్రభుత్వ పాఠశాలలో చెప్పినట్లయితే ఖేడ్ ప్రాంతానికి విద్య రంగంలో అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉంటుందని అంటున్నారు.

మహాత్మా గాంధీ విగ్రహావిష్కరణ



నవతెలంగాణ-గుమ్మడిదల

గుమ్మడిదల పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి జడ్పీ వైస్ చైర్మన్ కే ప్రభాకర్, మండల ప్రజా ప్రతినిధులతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. సర్పంచ్ చిమ్ముల నరసింహారెడ్డి, ఉప సర్పంచ్ మొగులయ్య, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, వార్డు సభ్యులు కే రవీందర్ రెడ్డి, ఆకుల సత్యనారాయణ, ఆంజనేయులు, ఎస్ జైపాల్ రెడ్డి, భాస్కర్, నాయకులు వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్ రెడ్డి, సద్ది విజయభాస్కర్ రెడ్డి, చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మహమ్మద్ హుస్సేన్, మోహన్ రెడ్డి, బాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తుడుం శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

దళిత గిరిజన ఆత్మగౌరవ సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



నవతెలంగాణ-నారాయణఖేడ్

నియోజకవర్గం తరపున పీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నాగర్‌కర్నూలు జిల్లా బిజినాపల్లిలో నిర్వహించనున్న గిరిజన దళిత ఆత్మగౌరవ సభకు నారాయణఖేడ్ నుంచి కార్యకర్తలను భారీగా తరలించారు. ఈ సందర్భంగా పీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ సంజీవరెడ్డి మాట్లాడుతూ దళిత గిరిజనులను తీవ్ర అన్యాయం చేస్తున్న టీఆర్ఎస్‌పై అన్ని వర్గాలవారు కలిసికట్టుగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. దళిత బంధు పథకం కేవలం టీఆర్ఎస్ కార్యకర్తలకే కాకుండా అన్ని వర్గాలవారికి వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నారాయణ జాదవ్, గిరిధర్ నాయక్, కాశయ్య, శ్రీనివాస్, రాంచందర్‌నాయక్, కిషన్‌నాయక్, నారాయణఖేడ్ నియోజకవర్గానికి చెందిన దళిత గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవ తెలంగాణ-పుల్కల్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఆదివారం పుల్కల్ మండల పరిధిలోని చౌటకూర్ ఉన్నత పాఠశాలలో 1996.97 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సిల్వర్ జూబ్లీని ఘనంగా నిర్వహించుకున్నారు. అప్పట్లో విద్యాభ్యాసం చేసిన చౌటకూర్ గ్రామానికి చెందిన ఆకుల రవికుమార్ నిజామాబాద్‌లో సీఐగా పదోన్నతి పొందడం హర్షించదగ్గ విషయమన్నారు. తమ బ్యాచ్‌కు చెందిన పలువురు ప్రభుత్వ ఉద్యోగాలు పొందారని గుర్తు చేశారు. పదో తరగతి అయిపోయి 25 సంవత్సరాల తర్వాత కలవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వీరేందర్ గౌడ్ మల్లేశం శ్రీనివాస్ ఎండి అజీమ్ వనజ కవిత నాగభూషణం బిక్షపతి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

బీఆర్ఎస్‌లో అనైక్యత



- అన్ని నియోజకవర్గాల్లో ఆశావాహులు
- ఎమ్మెల్యేలపై పెరుగుతున్న అసంతృప్తులు
- ఎన్నికలు సమీపిస్తున్నా కలిసిపోని నేతలు
- లీడర్ల గ్రూపులతో క్యాడర్ అయోమయం

నవతెలంగాణ-మెదక్
ప్రాంతీయ ప్రతినిధి

మూడోసారి కూడా అధికారంలోకి రావాలని భావిస్తున్న గులాబీ బాస్ ఆలోచనలకు అనుగుణంగా ఉమ్మడి మెదక్ జిల్లాలోని 11 అసెంబ్లీ స్థానాలనూ బీఆర్ఎస్ గెలిచితీరుతామని జిల్లా నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. క్షేత్ర స్థాయి పరిస్థితుల్ని కాస్త లోతుగా పరిశీలిస్తే.. ఒక్కో నియోజకవర్గంలో రెండు మూడు గ్రూపులుగా బీఆర్ఎస్ నేతలు పని చేస్తున్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేల మధ్య సఖ్యత లేదు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల మధ్య కూడా అదే పరిస్థితి ఉంది. ఈసారి కూడా టికెట్ తమకే వస్తుందని, తామే గెలుపు గుర్రాలమని భావిస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యేలు తమ పార్టీలోని ఇతర నాయకుల్ని కలుపుకుపోయే విషయంలో ఇంకా బేషజాలాలు వీడట్లేదు. ఆశావాహుల సంఖ్య పెరిగే కొద్దీ పార్టీకి తలనొప్పులు పెరిగే అవకాశంలేకపోలేదు.

పటాన్‌చెరులో ఆశావాహులు అధికమే..

పటాన్‌చెరు నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు పట్టుంది. మహిపాల్‌రెడ్డి రెండుసార్లు గెలుపొందారు. ఆయన అంతా తానై అభివృద్ధి కార్యక్రమాల్లో దూసుకుపోతున్నారు. ఆయన సోదరుడు సైతం క్యాడర్‌ను నడుపుతున్నారు. మరోపక్క బీఆర్ఎస్‌కు చెందిన చిట్కూల్ ఏకగ్రీవ సర్పంచ్, ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు నీలం మధు మాత్రం ఎమ్మెల్యేతో కలిసి పోవట్లేదు. తనకూ ప్రజాధరణ ఉందని నిరూపించుకోవడం కోసం చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ సందర్భంగా సభ పెట్టారు. పార్టీ టికెట్ కోసం ఆశపడుతున్నారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలనే డిమాండ్ వినిపిస్తుంది. మరోపక్క జిన్నారం మండలానికి చెందిన మాజీ జెడ్పీటీసీ కొలన్‌బాల్‌రెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే కే.సత్యనారాయణ, ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి కూడా ఎమ్మెల్యేతో కలిసి కార్యక్రమాల్లో పాల్గొనలేనంత గ్యాప్ ఉంది. తెల్లాపూర్, బొల్లారం మున్సిపాలిటీల్లో చైర్మన్లు ఎమ్మెల్యేతో విభేదించిన పరిస్థితి ఉంది.

సంగారెడ్డిలో తలోదారి

సంగారెడ్డిలో కాంగ్రెస్ ఎమ్మెల్యే జగారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే, చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింత ప్రభాకర్ అంతా తానై నడుపుతున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులుగా ఆయనే ఉన్నారు. ఇటీవల కార్పొరేషన్ పదవి కూడా ఆయనకు వచ్చింది. దీంతో నియోజకవర్గంలో అధికారిక కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలునంతా ఆయనే కనుసన్నల్లో సాగుతున్నాయి. అయితే ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు బీఆర్ఎస్‌కు చెందిన డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం కూడా సిద్ధంగా ఉన్నానంటూ ప్రెస్‌మీట్ పెట్టి ప్రకటించారు. ఆయనకు టికెట్ రాకపోతే మరో పార్టీ నుంచైనా పోటీ చేస్తారనే చర్చ కూడా ఉంది. మరో పక్క సదాశివపేటకు చెందిన ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు టికెట్ ఆశిస్తున్నట్లు చెబుతున్నారు. ఇటీవల తన పుట్టిన రోజు సందర్భంగా నియోజవర్గమంతటా భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు, ర్యాలీలతో హడావుడి చేశారు. చింత ప్రభాకర్ వెంటనే అందరూ తిరుగుతున్నట్లు కనిపిస్తోంది. లోపల మాత్రం చాలా మంది ఎవరికివారే గుసగుసలాడుకోడం చూస్తున్నాం. టీఎన్జీఓ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.రాజేందర్, మున్సిపల్ చైర్మన్ భర్త రవి, పార్టీ నాయకులు డాక్టర్ శ్రీహరి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నరహరిరెడ్డి, బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బీరయ్య యాదవ్, సంగారెడ్డి జెడ్పీటీసీ భర్త మనోహర్ గౌడ్ సైతం అవకాశం ఇస్తే తామూ పోటీ చేస్తామంటున్నారు.

> సంగారెడ్డి జిల్లాలోని బీఆర్ఎస్‌లో సఖ్యత కనిపించట్లేదు. ఆయా నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ పార్టీకి చెందిన ఇతర నాయకుల్ని కలుపుకుపోవడంలేదు. దీంతో టికెట్లు ఆశిస్తున్న ఆశావాహుల జాబితా పెరుగుతోంది. గ్రూపులుగా ఉండడంతో క్షేత్ర స్థాయిలో క్యాడర్ అయోమయానికి గురవుతోంది. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి మెదక్ జిల్లాలో అన్ని స్థానాల్నీ బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందనే ధీమాలో ఉన్నారు.

ఎస్సీ నియోజకవర్గాల్లోనూ..

జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్యంరావుతో పాటు రాష్ట్ర వైద్య సదుపాయాల కల్పన సంస్థ చైర్మన ఎర్రోళ్ల శ్రీనివాస్ కూడా టికెట్ ఆశిస్తున్నారు. ఎమ్మెల్యే కలుపుకుపోవడం లేదనే అభిప్రాయంతో ఉన్న మాజీ మంత్రి పరీదొద్దీన్ అనుచరులతో ఎర్రోళ్ల శ్రీనివాస్ టచ్‌లో ఉంటూ పావులు కదుపుతున్నట్లు చెబుతున్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే పలుమార్లు కేటీఆర్, హరీశ్‌రావుకు ఫిర్యాదు చేశారు. కొంతకాలం శ్రీనివాస్ నియోజవర్గంలో పర్యటించలేదు. ఎన్నికల వాతావరణం సమీపిస్తుండడంతో శ్రీనివాస్ తన ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు చెబుతున్నారు. సామాజిక ఉద్యమ కార్యకర్త ఢిల్లీ సంపత్ కూడా పావులు కదుపుతున్నారు. అందోల్‌లోనూ ఎమ్మెల్యే పట్ల క్యాడర్‌లో అసంతృప్తి ఉన్నట్లు చెబుతున్నారు.

ఎమ్మెల్యే సోదరుడు, తం డ్రి కనుసన్నల్లో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు సాగుతుండ డంతో కొందరు బీఆర్ఎస్ నా యకులు తమ ప్రాముఖ్యత ల భించడం లేదనే అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నారు. జెడ్పీ చైర్మ న్ మంజుశ్రీజైపాలరెడ్డి వర్సెస్ ఎమ్మెల్యే అన్నట్లుగా ఉంది. నియోజకవర్గంలో జెడ్పీ చైర్మన్ హెూదాలో పర్యటించిన సంద ర్భంలో స్థానిక ఎమ్మెల్యే కలిసి పోతున్న పరిస్థితి లేదంటున్నారు. ఇటీవల పుల్కల్‌లో పీఎసీఎస్ భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే లేకుండా చేశారు.

నారాయణఖేడ్‌లో ఒక్కడే అయినా..

నారాయణఖేడ్‌లో గ్రూపుల్లేకపోయినా ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి నియోకవర్గ అభివృద్ధి విషయంలో వేగం పెంచట్లేదనే చర్చ ఉంది.

ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా బలమైన గ్రూపు లేకపోయినా ద్వితీయ శ్రేణి నాయకుల్లో అసంతృప్తి ఉంది. అభివృద్ధి పనులకు నిధులు రావట్లేదని, చేసిన పనులకు బిల్లుల మంజూరీ కావట్లేని, ఇతర పనులు కావడంలేదని కింది స్థాయి నాయకత్వం అసంతృప్తిగా ఉంది.

ప్రతి ఇంటికి మిషన్ భగీరథ మంచి నీరు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



నవ తెలంగాణ-అమీన్ పూర్

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని ప్రతి ఇంటికి మిషన్ భగీరథ ద్వారా రక్షిత మంచినీరు అందిస్తున్నామని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ శ్రీమల్లికార్జున హిల్స్‌లో ఆదివారం ఉదయం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నల్లా కనెక్షన్ల ద్వారా మంచినీటి పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించాలనే సమున్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ మిషన్ భగీరథ పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో ప్రజల అవసరాల నిమిత్తం రెండు భారీ రిజర్వాయర్లు నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రతిరోజు మంచినీరు అందించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నందారం నర్సింహా గౌడ్, బీరంగూడ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం కమిటీ చైర్మన్ తులసి రెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులు, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,నందారం రమేష్ గౌడ్,చంద్ర శేఖర్, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

చిన్నపిల్లల ఉచిత వైద్య శిబిరం విజయవంతం



నవతెలంగాణ-కంగ్టి

మండల కేంద్రమైన కంగ్టిలో ఆదివారం మాజీ ఎంపీ, పీసీసీ ఉపాధ్యక్షులు సురేష్ కుమార్ షెట్కార్ సౌజన్యంతో శివచంద్ర షెట్కార్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో డాక్టర్ గిరిజషెట్కార్ చిన్నపిల్లలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం గురించి మహిళలకు అవగాహన కల్పించారు. చిన్నపిల్లకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు నపట్నినాగ్నాథ్, కుర్తె చందర్‌రెడ్డి, డాక్టర్, తాలుకా కాంగ్రెస్ నాయకులు సాగర్ షెట్కార్‌లకు శాలువాలు కప్పి సన్మానించారు. మారుతిరెడ్డి, మహిపతినాయక్, అస్టూరె సంతోష్, అస్టూరె విఠల్, భూమారెడ్డి, లక్ష్మణ్, లోండె నర్సప్ప, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు న్యాక్ రిపోర్టుకు సమాధానం ఇవ్వండి

- డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు



నవ తెలంగాణ-సిద్దిపేట

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులందరికీ న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) గుర్తింపు కోసం మీ వ్యక్తిగత మెయిల్‌కు వచ్చే స్టూడెంట్ సాటిస్ఫాక్షన్ సర్వే (ఎస్ ఎస్ ఎస్)లో న్యాక్ రిపోర్టులో సమాధానం ఇవ్వాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాక్ ఓరియంటేషన్ కార్యక్రమం స్థానిక అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ భవాని అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీకి న్యాక్ గుర్తింపు వస్తే యూజీసీ నుంచి నిధులు వస్తాయని, గుర్తింపు లభిస్తుందని, విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు లభిస్తాయని అన్నారు. 1982 లో ఏర్పాటైన ఈ యూనివర్సిటీలో ఇప్పటివరకు 25 లక్షల మందిపైగా విద్యార్థులు విద్యను అభ్యసించారన్నారు. గ్రూప్ - 4 ఎంప్లాయిస్ నుండి ఐఎఎస్ వరకు ఇక్కడ చదువుకున్న వారు అయ్యారని తెలిపారు. న్యాక్ సర్వేలో 21 అంశాల పైన ప్రశ్నలు ఉంటాయని, వాటికి విద్యార్థులు సమాధానాలను ఆన్ లైన్ లో ఇవ్వాలని, ఇక్కడ బోధించే కౌన్సిలర్స్ విద్యార్థులతో సర్వే పూర్తి చేయించాలని సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల , ఉపాధ్యాయుల ఫీడ్ బ్యాక్ మీదనే గుర్తింపు ఉంటుందని అన్నారు. తమ కళాశాల నుండి ఎలాంటి సహాయం కావాలన్నా చేస్తామని అన్నారు. విద్యార్థులు మీకు వచ్చే మెయిల్స్ కు స్పందించి మంచి సమాచారం ఇవ్వాలని సూచించారు. రీజనల్ కోఆర్డినేటర్ డాక్టర్ భవాని మాట్లాడుతూ ఇక్కడి కళాశాలలో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని, ఇక్కడ చదువుతున్న విద్యార్థులతో సర్వేలో పాల్గొని న్యాక్ గుర్తింపునకు తమ వంతుగా సహకారం అందిస్తామన్నారు. అంతకు ముందు కొంతమంది కౌన్సిలర్లు , విద్యార్థులు తమ అనుభవాలను తెలిపారు. అనంతరం డిప్యూటీ డైరెక్టర్ ను, కళాశాల ప్రిన్సిపాల్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సువర్ణ దేవి, రమణి, బాలకిషన్, రామచంద్రం, అంజయ్య, గరిపల్లి శ్రీనివాస్, శ్రీనివాస్, శ్రీశైలం, లాల్ బహదూర్ శాస్త్రి , వెంకట్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.













వైభవంగా మల్లన్న జాతర

- ప్రారంభమైన కొమురవెల్లి ఉత్సవాలు
- భారీగా తరలి వచ్చిన పట్నంవాసులు

నవ తెలంగాణ-కొమురల్లి

కొమురవెల్లి మల్లన్న జాతర ఆదివారం వైభవంగా సాగింది. హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. సంక్రాంతి తర్వాత వచ్చే మొదటి ఆదివారంతో ప్రారంభమైన మల్లన్న జాతర ఉగాది లోపు వచ్చే చివరి ఆదివారం వరకు జాతరవారాలుగా కొనసాగుతాయి. జాతరలో మొదటి వారిన్ని పట్నం వారంగా పిలుస్తారు. ఈవారం హైదరాబాద్ నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో కొమురవెల్లికి చేరుకొని మొక్కులు చెల్లించుకుంటారు. శనివారం సాయంత్రానికే భక్తులు క్షేత్రానికి చేరుకొని ముందుగా స్వామి వారిని దూళీ దర్శనం చేసుకున్నారు.. ఆదివారం ఉదయం కల్యాణ కట్ట వద్ద తలనీలాలు సమర్పించి కోనేరులో స్నానమాచరించారు. అనంతరం గంగరేణు చెట్టు వద్ద పంచ వన్నె రంగులతో పట్నాలు వేసి ఒగ్గు పూజారులు ఢమరుక నాదాల మధ్య మల్లన్న నామ స్మరణ చేస్తూ మొక్కులు చెల్లించారు. ఆ తర్వాత గొల్ల కేతమ్మ బలిజ మేడలమ్మలతో కొలువైన స్వామి వారిని దర్శించుకున్నారు. పట్నం వారం సందర్భంగా హైదరబాద్, పక్క రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలి రావడంతో దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లో నిలబడవలసిన పరిస్థితి ఏర్పడింది. ధర్మ దర్శనం కోసం ఆరు గంటల సమయం పడుతున్నట్లు ఆలయ అధికారులు చెప్పారు. స్వామికి ప్రీతికరమైన బోనం వండి ఆబోనం పాత్రలను పసుపు, కుంకుమ, బియ్యం పిండితో అందంగా అలంకరించి ఊరేగింపుగా ఆలయానికి బయలు దేరారు. ఆలయ ప్రాంగణంలో కిలోమీటర్ల పొడవునా భక్తులు బారులు తీరారు. ఒంటినిండ బండారి (పసుపు) పూసుకొని చేతిలో ఈరకోలలతో భక్తులకు పూనకం వచ్చే విధంగా పోతరాజులు చేసే కేకలు విన్యాసాలతో ఆలయ పరిసరాలు దద్దరిల్లాయి. స్వామివారికే కాకుండ నైవేద్యం సమర్పించడానికి బోనాలతో భక్తులు గుట్టపై కొలువైన రేణుక ఎల్లమ్మ గుడికి చేరుకొని అమ్మవారికి బోనాలు, కల్లు సాక నైవేద్యంగా పెట్టి మొక్కలు చెల్లించుకున్నారు. కొమురవెల్లి మల్లన్న జాతరకు భక్తులు భారీ తరలిరావడంతో ఆలయం చుట్టూ 2కి. మీ దూరం మేర భక్తులతో నిండిపోయింది. స్వామి వారి దర్శనం కోసం వచ్చే భక్తులకు కావల్సిన సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో ఆలయ అధికారులు విఫలం అయ్యారు. వసతి గదులలో ఆదివారం. ఉదయం నుండి విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో నీటి సమస్య తలెత్తడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. అన్నదాన సత్రము సమీపంలో డ్రైనేజీ లీకై మురుగు నీరు మెయిన్ రోడ్డుపై ప్రవహించడంతో బోనాలు తీసుకు వెళుతున్న భక్తులకు చాల ఇబ్బంది ఏర్పడింది. స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు సేవాలందించారు ఆలయ ఈఓ బాలాజీ, దర్మకర్తల మండలి చైర్మన్ గీసబిక్షపతి, ఏఈఓ అంజయ్య ఆలయదర్మకర్తలు పర్యవేక్షించారు.





పక్షిని కాపాడిన హరితహారం సిబ్బంది



నవ తెలంగాణ-సిద్దిపేట

సంక్రాంతి నేపథ్యంలో గాలిపటాలను మాంజాలతో ఎగురవేయగా మెదక్ రోడ్డు రిలయన్స్ మార్ట్ ఎదురుగా ఉన్న చెట్టుపై మాంజా దారం ఓ పక్షి కాళ్లకు చుట్టుకుంది. పక్షి అక్కడే బందీగా మారిపోయింది. ఈ విషయాన్ని గమనించిన ఓ అడ్వకేట్ హరితహారం అధికారి ఐలయ్యకు సమాచారం ఇచ్చారు. వెంటనే హరితహారం సిబ్బంది అక్కడికి చేరుకొని లాడర్ వాహనాన్ని తెప్పించి పక్షిని మాంజా దారం చర నుండి విడిపించారు. మనిషి విలాసాల కోసం చేస్తున్న ప్రతి పని ఏదో రకంగా జీవజాలంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతోందన్న విషయానికి ఈ ఘటన ఉదాహరణగా నిలుస్తుందని పలువురు చర్చించుకున్నారు. ఒక పక్షి పట్ల హరితహారం సిబ్బంది చూపిన ప్రత్యేక శ్రద్ధపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన



నవతెలంగాణ-జోగిపట

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగం ఓటు హక్కు ఇచ్చిందని, దానికంటే గొప్పది ఏదీ లేదని జోగిపేట ఉప తహసీల్దార్ మధుకర్ రెడ్డి అన్నారు. ఈ నెల 25న 13వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార శకటం జోగిపేటకు ఆదివారం చేరుకుంది. తహసీల్దార్ కార్యాలయం ముందు కళాకారులు ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటును మించినది ఏదీ లేదు.. నేను తప్పకుండా ఓటు వేస్తా అనే నినాదంతో ప్రచార శకటం ప్రచార జాత నిర్వహిస్తున్నారు. 18 సంవత్సరాల నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా ఆన్లైన్లో, సంబంధిత బీయల్ఓ కేంద్రాల వద్ద ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన ప్రజలను విజ్ఞప్తి చేశారు. ఓటరుగా నమోదు చేసుకొని మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకొని అభివృద్ధికి బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది రమేష్, మహేశ్వరి, ఉమా గౌరీ, జోగినాథ్, శ్రీనివాస్, ప్రభు, యాదగిరి, కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

దుర్గమ్మ పండుగలో తేనెటీగల దాడి



నవతెలంగాణ-తొగుట

దుర్గమ్మ పండుగలో తేనెటీగలు దాడి చేసిన సంఘటన మండలంలోని గోవర్ధన గిరి మధిర గ్రామం చిన్న ముత్యంపేటలో చోటు చేసుకుంది.ఆదివారం గ్రామస్తులు సాయంత్రం దుర్గమ్మ పండుగ ప్రారంభించారు. అనంతరం వంటలు చేస్తుండగా వేప చెట్టు మీద ఉన్న తేనె టీగలు ఒక్కసారిగా వారి మీద దాడి చేశాయి. దీంతో తలొదిక్కు పరుగులు తీశారు. గ్రామానికి చెందిన రుక్కమ్మ, జగన్నాథంకు తీవ్రంగా కుట్టడంతో సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి ప్రభుత్వాసుపత్రిలో వారిని పరామర్శించారు. సర్పంచ్ తోయేటి ఎల్లం ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఎంపీ ఆసుపత్రి వర్గాలకు ఫోన్ ద్వారా మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

దేవసేన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి



నవతెలంగాణ- గజ్వేల్

ఉపాధ్యాయుల నిరసనపై డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అధికారి దేవసేన చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు వలిహమ్మద్, ప్రధాన కార్యదర్శి యాదగిరి అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బ్లాక్ చేసిన 13 జిల్లాల స్పౌస్ బాధిత ఉపాధ్యాయులు తమకు న్యాయం చేయాలని అడగడం తప్పా అని వారు ప్రశ్నించారు. శాంతియుతంగా డీఎస్ వద్ద చేపట్టిన మౌన దీక్షలో పాల్గొన్న ఉపాధ్యాయులపై డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అధికారి దేవసేన చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. న్యాయమైన డిమాండ్లను అడుగుతున్నామని చెప్పారు. మీరు ఉపాధ్యాయులా. రౌడీలా అని అనడం, పైగా కేసులు పెట్టిస్తానని బెదిరించడం సబబు కాదన్నారు. ఉపాధ్యాయులపై నిఘా పెట్టాలని పోలీసులకు సూచించడం సమంజసం కాదన్నారు. నిరసన తెలుపడం రాజ్యాంగ హక్కు అని గుర్తు చేశారు. ఉన్నతాధికారి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని టీఎస్‌యూటీఎఫ్ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

బీజేపీలో చేరిన యువకులు



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి మండల శాఖ ఆధ్వర్యంలో గుడితండా 38వ బూతులు 50 మంది యువకులు బీజేపీలో చేరారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వరరావు దేశ్పాండే కండువా కప్పి వారిని పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన పథకాలు చూసి ఆకర్షితులై బీజేపీలో చేరారన్నారు. ఇలాంటి చేరికలు చాలా ఉంటాయన్నారు. నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి గడపగడపకు తెలియజేయాలని కోరారు. సంగారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ పోచారం రాములన్న, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు పవన్ ముదిరాజ్, సంగారెడ్డి మండల శాఖ అధ్యక్షులు కే.పాపయ్య, సంగారెడ్డి ఎస్టీ మోర్చా అధ్యక్షులు సూర్య నాయక్, వినోద్, నరేష్, వార్డ్ మెంబర్ సునీల్, నవీన్, కిరణ్, రామ్, విష్ణు, కళ్యాణ్, మోహన్, పాండు, అశోక్, సంతోష్, ప్రవీణ్, దేవి, సుభాష్, రాజు, బాబు, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

పట్టాలున్నవారికి పొజిషన్ చూపించాలి

- సుల్తాన్పూర్‌లో ఇల్లు లేని పేదలందరికీ స్థలాలు ఇవ్వాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నరసింహారెడ్డి



నవ తెలంగాణ-అమీన్ పూర్

మండల పరిధిలోని సుల్తాన్పూర్ గ్రామంలో గల సర్వే నెంబర్ 381లో ప్రభుత్వం ఇచ్చిన పట్టాలున్నవారికి పొజిషన్ చూపించాలని, గ్రామంలో ఇల్లు లేని పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టాదారులు, ఇల్లు లేని పేదలతో గ్రామంలోని గాంధీ బొమ్మ వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 381 సర్వేనెంబర్‌లో పేదలకు ప్రభుత్వమే పట్టాలు ఇచ్చిందన్నారు. పట్టాలు పొందిన వారందరికీ పొజిషన్ చూపించాలన్నారు. గ్రామంలోని ఇల్లు లేని పేదలందరికీ అక్కడే స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. 381 సర్వే నెంబర్‌తో పాటు అనేక ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లిందని, వారిని ఏమాత్రం పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు పట్టాలున్న పేదల గుడిసెలు వేసుకుంటే తొలగించడం ఏంటని ప్రశ్నించారు. పెద్దలకు ఒక న్యాయం, పేదలకు ఒక న్యాయమా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వాలు దాదాపు 100 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందని కానీ ఇప్పటివరకు వారికి పొజిషన్ చూపెట్టకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. మరోవైపు భూముల ధరలు పెరిగిన నేపథ్యంలో పేదలు ఇంటి స్థలం కొనలేని పరిస్థితిలో ఉన్నారని ప్రభుత్వ భూములను పేదలకు ఇళ్ల స్థలాలకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవదానం మాట్లాడుతూ సుల్తాన్పూర్ గ్రామంలో ఉన్న 381 సర్వే నెంబర్లో దాదాపు 25 ఎకరాల భూమి ఉందన్నారు. గ్రామంలో ఉన్న పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన పట్టాదారులకు వెంటనే పొజిషన్ చూపించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజలే అట్టి భూమిని ఆక్రమించుకొని ఇండ్లు నిర్మించుకుంటారని తెలిపారు. ఈ విషయంపై ప్రభుత్వ అధికారులు సానుకూలంగా స్పందించి ఇండ్ల స్థలాలు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే సీపీఎంతో పాటు కాంగ్రెస్, ఇతర పార్టీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. లబ్దిదారులు యాదయ్య, ఆంజనేయులు, మోసిన్, కలమ్మ బాలమని శాంతమ్మ మణెమ్మ లక్ష్మీ అనురాధ సంపూర్ణ పుష్పమ్మ రాణమ్మ పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమం

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్



నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్

రైతాంగాన్ని మోసగించిన కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్ అన్నారు. ఆదివారం సిద్దిపేటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ నెల 26న రిపబ్లిక్ డే పురస్కరించుకొని సిద్దిపేటలో రైతులతో ట్రాక్టర్లు బైకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని పంటలకు మద్దతు ధర ప్రకటించాలన్నారు. రైతుల పంట రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని 26వ తేదీన ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు యాదవ రెడ్డి జిల్లా నాయకులు సత్తిరెడ్డి, కనకచారి,భాస్కర్ రెడ్డి, కృష్ణారెడ్డి ,ప్రతాపరెడ్డి, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మిక సంఘం 2023 క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-నారాయణఖేడ్

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కమిటీ రూపొందించిన సంఘం 2023 క్యాలెండర్‌ను ఆదివారం ఎమ్మెల్యే ఎం.భుపాల్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ గీతా కార్మికుల కోసం ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. గౌడ కమ్యూనిటీ భవన నిర్మాణానికి కృషి చేస్తామన్నారన్నారు. కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ఈత చెట్లను నాటడానికి కృషి చేస్తుందన్నారు. కల్లుగీత కార్మికులు సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి పనులు చేపడుతుందన్నారు. కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అంజాగౌడ్ మాట్లాడుతూ గౌడ కమ్యూనిటీ భవన నిర్మానానికి స్థలం కేటాయించి భవనం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. భవన నిర్మాణం చేస్తామని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కిష్టాపురం పీఏసీఎస్ చైర్మన్ కృష్ణాగౌడ్, గౌడ సంఘం నాయకులు రాంచెందర్ గౌడ్, బీఆరెస్వి డివిజన్ నాయకులు అంజా గౌడ్,జిల్లా బీసీ కార్పొరేషన్ టాడిటాపర్ సభ్యులు మరియు సంఘం జిల్లా కమిటీ సభ్యులు నర్సింహా గౌడ్,సంఘం ఖేడ్ డివిజన్ ఉపాధ్యక్షులు లక్ష్మా గౌడ్,సురేందర్ గౌడ్,డా.బాలా గౌడ్, రాపర్తి సొసైటీ అధ్యక్షులు సాయిబాబా గౌడ్,ప్రభాకర్ గౌడ్,కనకరాజు గౌడ్,రాంచెందర్ గౌడ్,రమణ గౌడ్, శ్రీనివాస్ గౌడ్,రాజా గౌడ్,ప్రభాకర్ గౌడ్,అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ లేని గ్రామాలుండదనే సంకల్పం గొప్పది

- గూడెంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్





నవతెలంగాణ-బెజ్జంకి

దేవుడులేని గ్రామమున్న ఇబ్బందిలేదుగాని.. సబ్బండ వర్గాల చెందిన మహనీయుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహములేని గ్రామాలుండదనే సంకల్పం గొప్పదని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గూడెం గ్రామంలో నెలకొల్పిన అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే రసమయి, రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్, మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, ప్రజాప్రతినిధులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహనీయుడు అంబేద్కర్ రచించిన రాజ్యాంగం, ఆయన ఆలోచన విధానంతోనే నేడు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాయని, అంబేద్కర్ విగ్రహ అవిష్కరణకు ఐక్యతతో శాయశక్తులా కృషి చేసి మహెూత్సవంగా నిర్వహించిన గ్రామస్తులు ఇదే స్ఫూర్తితో గ్రామాభివృద్ధికి తోడ్పాటును అందించాలని ఎమ్మెల్యే రసమయి కోరారు. అనంతరం గ్రామస్తులు ప్రజాప్రతినిధులను శాలువా కప్పి జ్ఞాపికతో సన్మానించారు. ఎంపీపీ నిర్మల,జెడ్పీటీసీ కనగండ్ల కవిత,ఎఎంసీ చైర్మన్ రాజయ్య, సర్పంచ్ దేవా రాజశ్రీ,వైస్ ఎంపీపీ చెలుకల సభిత,ప్రజా సంఘాల నాయకులు బోనగిరి శ్రీనివాస్,దీటీ బాలనర్స్,వడ్లూరీ పర్శరాం, బీఆర్ఎస్ అనుబంధ కమిటీల నాయకులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పాకులాట కోసం చరిత్రను కించపరచొద్దు

పదవుల కోసం, అధికారం కోసం పాకులాటడడంలేదని, దళితుల విముక్తి కోసం పోరాటం చేసిన చరిత్ర మాదనిచ పదవులు, అధికారం కోసం పాకులాడి అంబేద్కర్ ఆలోచనను కించపరచొద్దని రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్ అన్నారు.

బోధించు.. సమీకరిం చు..పోరాడు అనే అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని నాయకు లు విస్మరించి ఆధిపత్యంలో మగ్గిపోతున్నారన్నారు. అంబేద్క ర్ విగ్రహావిష్కరణ మహెూత్సవానికి ఆహ్వానించి అగౌరవపరచడం సరైందికాదన్నారు. వ్యక్తుల కోసం పాకులాడడం మానుకుని ఐక్యతతో వ్యవస్థను మార్చేందుకు కృషి చేయాలని సూచించారు.

విగ్రహాలు కాదు.. అంబేద్కర్ వాదంలో నడుచుకోవాలి

ఆర్థికంగా కొంత మెరుగ్గా ఉన్నవారు అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు సహాయ సహకారాలు అందజేస్తారని, విగ్రహాలు కాదు.. అంబేద్కర్ ఆలోచనా విధానంలో నడుచుకోవాలని అంబేద్కర్ యువజన సంఘం, ప్రజా సంఘాల నాయకులకు, దళిత సామాజిక వర్గాల ప్రజలకు మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్ సూచించారు. తాను పెద్దపెద్ద పుస్తకాలు చదువలేదని, అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్ల ఈ స్థాయికి ఎదిగానని చెప్పడమే తప్ప.. ఆయన కోసం ఏమి చేశామో ఆలోచన చేయాలని సూచించారు. అంబేద్కర్ విగ్రహావిష్కరణ మహెూత్సవానికి పిలిచి నిర్వాహకులు అగౌరవపరచొద్దని, దళిత సామాజిక వర్గాల ప్రజలు తెలుసుకోవాలని సూచించారు.

నిర్వాహకుల లోపంతో బగ్గుమన్న విభేదాలు

అంబేద్కర్ విగ్రహావిష్కరణలో నిర్వాహకుల లోపంతో నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకుల్లో వ్యక్తిగత విభేదాలు బగ్గుమన్నాయి. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ వెళ్లిన అనంతరం మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ మహెూత్సవంలో నిర్వాహకులు వ్యవహరించిన తీరుపై తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. నియోజవర్గంలోని బీఆర్ఎస్ నేతల్లో విభేదాలు ఒక్కసారిగా బహిర్గతమయ్యాయి.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గురువులను సత్కరించిన పూర్వ విద్యార్థులు



నవతెలంగాణ-జోగిపేట

అల్లాదుర్గం మండలం గడి పెద్దాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004- 06 పదో తరగతి బ్యాక్ పూర్వ విద్యార్థులు ఆదివారం జోగిపేట పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ఒకరికి ఒకరు పరిచయాలు చేసుకుంటూ విద్యార్థి దశలో జరిగిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి పూర్వ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు నర్సింలు, వెంకయ్య, రమేష్, నాగభూషణం, సుధాకర్, ప్రభు, మోహన్ దాస్, యాదగిరి, లలిత, చంద్రకళ, శేఖా గౌడ్, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు గురువులకు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి ఆశీస్సులు పొందారు. చదువుకున్న పాఠశాలకు ఉన్నత స్థాయికి ఎదిగి మంచి పేరు తీసుకురావాలని గురువులు విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గడి పెద్దాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు శ్రీనివాస్ రెడ్డి, రమేష్, లలిత, లక్ష్మి, ప్రవీణ, సుమలత, సిద్దేశ్వర్, శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్కన్నపేట యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా దామోదర్



నవతెలంగాణ-అక్కన్నపేట

సిద్దిపేట కాంగ్రెస్ అధ్యక్షురాలు తూముకుంట అంక్షరెడ్డి, హుస్నాబాద్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బినవేని రాకేష్ ఆదేశాల మేరకు అక్కన్నపేట మండలం యువజన కాంగ్రెస్ కమిటీకి నియామక పత్రాలను ఆదివారం అందించారు. అక్కన్నపేట మండల యూత్ అధ్యక్షులుగా పాండ్రాల దామోదర్, నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా మంద పరశురాం, అసెంబ్లీ జనరల్ సెక్రటరీగా నకీర్తి మునిరాజులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి ఈ పదవులు రావడానికి సహకరించిన కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనా రెడ్డి, జిల్లా అధ్యక్షులు అంక్షరెడ్డి, సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, హుస్నాబాద్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బీనవేని రాకేష్, అక్కన్నపేట మండల కాంగ్రెస్ అధ్యక్షులు జంగపెల్లి ఐలయ్య, అక్కన్నపేట్ సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి, గుడాటిపల్లి సర్పంచ్ బద్దం రాజిరెడ్డి, గౌరవెల్లి సర్పంచ్ భైరగోని పుష్పలీల, కట్కూరు సింగిల్ విండో వైస్ చైర్మన్ ముకుందారెడ్డి, హుస్నాబాద్ సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎగ్గిడి ఐలయ్య, డైరెక్టర్ బండి కుమార్ గౌడ్, బుర్ర ప్రభాకర్ గౌడ్, హుస్నాబాద్ మండల అధ్యక్షులు బంక చందు, గొర్ల శ్రీనివాస్ స్వప్న, బందారపు శ్రీనివాస్,మేక రమేష్, భైరగోని శ్రీనివాస్, భాస్కర్ నాయక్, గుగులోతు రాంబాబు, వల్లపు పరశురాంలకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో యువజన కాంగ్రెస్‌ను బలోపేతం చేయడానికి, కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు.

చలో ప్రగతి భవన్ వెళ్తున్న ఉపాధ్యాయులు అరెస్టు



నవతెలంగాణ-జహీరాబాద్

ప్రభుత్వం ఉపాధ్యాయులకు విధిస్తున్న నిబంధనలకు విరుద్ధంగా చలో ప్రగతి భవన్ వెళుతున్న ఉపాధ్యాయులను అరెస్టు చేసి స్టేషన్కు తరలించడం హేయమైన చర్య అని ఉపాధ్యాయులు విఠల్, సియాసత్ అలీ అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ 'నీళ్ల, నిధులు, నియామకాలు స్థానికులకు దక్కాలని సంఘాల చైతన్యంతో తెలంగాణ రాష్ట్రం సాకారమైంది. అందుకు ప్రతి ఒక్కరూ తమ స్థానిక జిల్లా, జోన్‌లో పనిచేసుకుంటారని సంతోషపడ్డారు. దిక్కుమాలిన 317 జీఓతో అనేక మంది ఉద్యోగ ఉపాధ్యాయులు తమ స్థానికతకు ఎసరు వస్తుందని ఎవరు కలలో కూడా ఊహించలేదు. స్థానికత కోసం కొట్లాడిన తెలంగాణ స్థానికతకే దిక్కు లేకుండా చేశారు. రాత్రికి రాత్రి తీసుకొచ్చి ఇది జరిగితేనే, మిగితా వారికి ప్రమోషన్లు, ట్రాన్స్ఫర్లు జరుగుతాయని నమ్మించి ప్రభుత్వం ఎంతో మంది జూనియర్ అనే నెపంతో జిల్లా, జోన్ దాటించింది. అందుకు ఎన్నో రోజులుగా 317 బాధిత ఉద్యోగ ఉపాధ్యాయులు నిరసన తెలుపుతునా పట్టించుకోలేదు. 317 వల్ల స్థానికత కోల్పోయిన ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యను పట్టించుకోకుండా ప్రమోషన్, ట్రాన్స్ఫర్స్ జరపాలి అనేది అన్యాయం అని భావిస్తోంది బాధిత సంఘం. మొదట 317 బాధితులకు స్థానిక జిల్లాలకు పంపిన తరువాత ప్రమోషన్లు ట్రాన్స్ఫర్లు చేపట్టాలి' అని అన్నారు. చలో ప్రగతి భవన్ వెళ్తుండగా అరెస్ట్ చేసి జహీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కె.జయప్రకాష్ రాములు, నర్సింలు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి



నవతెలంగాణ-చిన్నకోదూరు

భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 28న కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించ తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ అనుబంధ సంఘం బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్ కోరారు. చిన్నకోదూర్ మండల కేంద్రంలో బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ధర్నా కరపత్రాన్ని ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులకు ఉచిత మోటార్ సైకిల్ అందిస్తామని 2022-23 బడ్జెట్ సమావేశంలో అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారని, ఈ హామీని వెంటనే అమలు చేయడానికి సంక్షేమ బోర్డులో పేరు నమోదు చేసుకున్న ప్రతి భవన నిర్మాణ కార్మికుడికి ఉచిత మోటార్ వెహికల్ అందించాలని డిమాండ్ చేశారు. 55 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి భవన నిర్మాణ కార్మికుడికి ప్రతి నెలా రూ.5 వేల పింఛన్ ఇవ్వాలని కోరారు. ఇల్లు లేని వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక నాయకులు చింతల నారాయణ, మందపల్లి చంద్రం, పోతురాజు రాజు, ఇబ్రహీంపురం ఐలయ్య, తిరుపతి, కమ్మలింగం,రవి తదితరులు పాల్గొన్నారు.

కష్టంతో కాకుండా ఇష్టంతో చదవండి

- సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి
- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- శిశు విహార్ హై స్కూల్‌లో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు



నవ తెలంగాణ-పటాన్‌చెరు

విద్యార్థులు సత్ప్రవర్తనతో రేపటి భావిభారత నిర్దేశకులుగా ఎదగాలని, కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి పటాన్‌చెరు పట్టణంలోని శిశు విహార్ హై స్కూల్‌లో చైర్మన్ అండ్ కరస్పాండెంట్ అనిల్ కె.పిళ్లై, డైరెక్టర్ అండ్ ప్రిన్సిపల్ ఆర్.బీనా పిళ్లై ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం పేరెంట్స్ మీటింగ్ పెట్టి విద్యార్థుల ప్రతిభపై చర్చించాలని సూచించారు. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని చెప్పారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో రాణించాలని తెలిపారు. 15 సంవత్సరాలుగా పటాన్‌చెరు, కర్దనూర్ బ్రాంచులలో విద్యార్థులకు ఉన్నతమైన విద్యాభ్యాసాన్ని అందిస్తున్న శిషు విహార్ యాజమాన్యానికి, ఉపాధ్యాయులను ఎమ్మెల్యే అభినందించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

జహీరాబాద్ కుస్తీ పోటీలకు నిలయం

- ఎమ్మెల్యే మాణిక్యరావు



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ నియోజకవర్గం అనాదిగా కుస్తీ పోటీలకు నిలయంగా మారిందని ఎమ్మెల్యే మాణిక్ రావు అన్నారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలోని బాగా స్టేడియంలో అంతర్ రాష్ట్ర కుస్తీ పోటీలను మల్లయోధులు అలీ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన మల్లయోధులకు నగదు బహుమతులతో పాటు ట్రోపీలను ఎమ్మెల్యే మాణిక్యరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంతరించిపోతున్న కుస్తీ పోటీలను గుర్తు చేసేందుకు జహీరాబాద్ ప్రాంతంలో నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మొహమ్మద్ తన్వీర్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మోహియోద్దీన్, షేక్‌ఫరీద్, బిజీ సందీప్ పాల్గొన్నారు.

కూడవెల్లి జాతరకు పోటెత్తిన భక్తజనం



నవ తెలంగాణ-దుబ్బాక: దుబ్బాక పరిధిలోని అక్బర్ పేట భూమ్ పల్లి మండలం రామేశ్వరంపల్లిలో వెలసిన కూడవెల్లి శ్రీ రామలింగేశ్వర స్వామి మాఘ అమావాస్య జాతర సందర్భంగా రెండో రోజైన ఆదివారం భక్తులు పోటెత్తారు. వేల సంఖ్యలో భక్తులు కూడవెల్లి వాగులో పుణ్య స్నానాలు ఆచరించి రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. సుమారు లక్ష మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ ఈవో విశ్వనాథ శర్మ తెలిపారు.

మల్లన్నసాగర్‌ను సందర్శించిన ట్రెజరీ అధికారులు

నవతెలంగాణ-తొగుట: మల్లన్నసాగర్ ప్రాజెక్టును తెలంగాణ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ అధికారులు సందర్శించారు. డాక్టర్ ఎంసి హెచ్ఆర్డి ట్రైనింగ్ సెంటర్ హైద్రాబాద్ వారు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఫీల్డ్ విజిట్ ప్రోగ్రామ్‌లో భాగంగా తెలంగాణ ట్రెజరీ విభాగం నుంచి 35 జూనియర్ అకౌంట్ అధికారులు, కో-ఆర్డినేటర్ టిఎం.బాషా, ఎస్.బాలరాజుతో కలిసి మల్లన్న సాగర్ ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా కాళేశ్వరం డిప్యూటీ ఈఈ శ్రీనివాస్ రావు వారికి ప్రాజెక్టు గురించి క్లుప్తంగా వివరించారు. కొన్ని దశాబ్దాలుగా గోదావరి నదిలో నీటి కొరత వల్ల చాలా వరకు పంటలు పండక కరువు ఏర్పడుతుందన్నారు. కానీ ప్రాణహిత నది గోదావరి నదిలో కలిసే మేడిగడ్డ ప్రాంతంలో నీరు పుష్కలంగా లభిస్తుందని తెలిపారు. కాబట్టి ఆ నీటిని 100 మీటర్ల ఎత్తు నుంచి మల్లన్నసాగర్ లెవల్ 557 మీటర్ల ఎత్తులో ఉన్న మల్లన్నసాగర్ ప్రాజెక్టులోనికి లిఫ్ట్‌ల ద్వారా పంపిస్తున్నారని తెలిపారు. దీని వల్ల ఆయ కట్టు ప్రాంతానికి లాభం చేకూరుతుందని వివరిం చారు. రైతుల కొరకు ప్రాజెక్టును ఇంత ప్రతిష్టాత్మకంగా, వేగంగా నిర్మించినందుకు ట్రెజరీ టీం అధికారులు అభినందించారు. ఈ ప్రాజెక్టు వల్ల రాబోయే కాలంలో రైతులు సాంఘీక, ఆర్థికపరమైన అభివృద్ధిని సాధిస్తారని తెలిపారు.


కబ్జా కోరలో భూదాన్ భూమి



నవతెలంగాణ-పటాన్‌చెరు

ముత్తంగి సర్వే నెంబర్ 521లోని భూదాన్ భూమి కబ్జాకు గురైనా అధికారులు కళ్లప్పగించి చూస్తున్నారని పటాన్‌చెరు మాజీ జెడ్పీటీసీ, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్‌గౌడ్ మండిపడ్డారు. ముత్తంగిలో కబ్జాకు గురైన భూదాన్ భూములను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా భూదాన్ భూముల ప్రొసీడింగ్స్. క్యాన్సలేషన్ ఆర్డర్ పత్రాలను ఆదివారం మిడియాకు అందజేశారు. ప్రభుత్వ అధీనంలో ఉన్న 3 ఎకరాల భూదాన్ భూమిని కబ్జా చేసింది ఎవరు? రోడ్లు వేసింది ఎవరు? అధికారులు వారిపై ఎలాంటి చర్యలు తిసుకున్నారో ప్రజలకు చెప్పాలన్నారు. క్యాన్సలేషన్ ఆర్డర్స్ వచ్చి ఇన్ని రోజులు గడుస్తున్నా కబ్జా దారులు ఎవరో గుర్తించి చెప్పకపోవడం వెనుక పలు అనుమానాలకు దారి తీస్తోందన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ కబ్జాదారులు ఎవరో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 12న కలెక్టర్ నుంచి క్యాన్సలేషన్ కాపీ వచ్చిన సంగతి కూడా తెలియని పటాన్‌చెరు తహసీల్దార్ ఈనెల 15 నాటికి కూడా ప్రొసిడింగ్ కాపీనే ఇస్తున్నారని తెలిపారు. తహసీల్దార్ వాస్తవాలు తెలుసుకోకుండా విధులు ఎలా నిర్వర్తిస్తున్నారని, లేక తహసీల్దార్ కబ్జా దారులతో కుమ్మక్కు అయ్యారా అని ప్రశ్నించారు. జిల్లా అధికారుల నుంచి ఏ రకమైన ఆర్డర్స్ వచ్చాయో కూడా తెలియని తహసీల్దార్ విధులు ఎలా నిర్వహిస్తున్నారని తెలిపారు. భూదాన్ భూముల పరిస్థితే ఇలా ఉంటే సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. సమస్యలపై ఎవరైనా ప్రశ్నిస్తే అధికార పార్టీ నాయకుల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు భూదాన్ భూములపై దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ మోర్చా ఉపాధ్యక్షురాలు గడ్డ పుణ్యవతి గ్రామస్తులు షాపి, కిషోర్ రెడ్డి,శకిల్,ధన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.


యువత చేతిలోనే దేశ భవిష్యత్



నవతెలంగాణ-హవేలిఘనపూర్

భారతదేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో అన్ని రాష్ట్రాలకు నిధులు మంజూరు చేయడంతోనే అభివృద్ధి చెందుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ అన్నారు. గంగాపూర్ గ్రామంలో బీజేపీ జెండాను ఆదివారం ఆవిష్కరించారు. గంగాపూర్ గ్రామంలోని ఆయా పార్టీల నాయకులు 30 మంది బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జనార్దన్ రెడ్డి, హైకోర్టు అడ్వకేట్, బీజేపీ రాష్ట్ర నాయకులు తాళ్లపల్లి రాజశేఖర్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అన్ని వర్గాలను మోసం చేస్తూ, కేంద్రం ఇచ్చే నిధులతో అభివృద్ధి పనులు చేస్తూ బీజేపీని విమర్శించడం ఎంతవరకు సమంజసమని మండిపడ్డారు. ప్రతి గ్రామంలో సీసీరోడ్లు, ఎన్ఆర్ఈజీఎస్ నిధులు, ఉచిత బియ్యం వంటి పథకాలు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తేనే రాష్ట్రంలో అమలవుతున్నాయన్నారు. రాబోయే ఎన్నికలలో బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేసే మోసాలను ప్రజలకు వివరిస్తూ చైతన్యం చేయాలని సూచించారు. బీజేపీ మండల అధ్యక్షుడు రంజిత్ రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు శ్యాంసుందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లాల విజయ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ 3
మెదక్
సోమవారం 23 జనవరి 2023





చికెన్ ధరలు (కే.జీ)

ఫారంరేటు	- రూ.102
రిటైల్	- రూ. 124
విత్‌స్కిన్	- రూ. 180
స్కిన్‌లెస్	- రూ. 205

ఆదివారం సైతం నిరుపేదల ధర్నా



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

డబుల్ బెడ్‌రూంల కేటాయింపులో నిరుపేదలకు అన్యాయం చేసి ధనికులకు పంపిణీ చేపట్టారనే ఆరోపణతో పేదలు చేపట్టిన ధర్నా ఆదివారం నాటికి 258 రోజుకు చేరుకుంది. డబుల్ ఇండ్ల పంపిణీలో నిరుపేదలకు న్యాయం జరిగే వరకు పట్టువదలని విక్రమార్కులుగా పేద ప్రజలు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతూనే ఉన్నారు. ఆదివారం సెలవు దినంలో కూడా నిరుపేదలు ధర్నా చేపడుతూ తమకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేస్తున్నారు. 258 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు నాయకులుకానీ అధికారులుకానీ పేద ప్రజలను కనీసం వారిని కలిసి, డిమాండ్ ల పరిష్కారానికి కృషి చేస్తామనే హామీ ఇవ్వకపోవడంతో నిరుపేదలు తీవ్ర ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. తమ నిరుపేదల గోడును పట్టించుకునే వారే లేకుండా పోయారని, రాష్ట్ర ముఖ్యమంత్రి నియోజక వర్గంలో పేదలకు న్యాయం జరగడం లేదంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు తమ గోడును పట్టించుకుని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

పట్టాల పంపిణీతో నెరవేరిన రైతుల కల

- కాంగ్రెస్ హయాంలో తీసుకుంటే బీఆర్ఎస్‌లో పట్టాలు
- మంత్రి హరీశ్‌రావ్ ప్రోత్సాహంతో రైతుల్లో ఆనందం



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

కాంగ్రెస్ అధికారంలో ఉండగా రైతుల నుంచి భూములను తీసుకుంది. హామీలను అమలు చేయకపోవడంతో బీఆర్ఎస్ పార్టీ వచ్చిన తరువాత మంత్రి హరీశ్‌రావ్ ప్రోత్సాహంతో పట్టాల పంపిణీతో రైతుల కల నెరవేరినట్లయింది. గత కాంగ్రెస్ పార్టీ హయాంలో పరిశ్రమల ఏర్పాటు కోసం మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులో గల సుమారు 802 ఎకరాల ప్రభుత్వ భూమిని రైతుల నుంచి 2008 సంవత్సరంలో తీసుకుంది. ఈ భూములలో కూచారం, ముప్పిరెడ్డిపల్లి, జీడిపల్లి, కాళ్ళాకల్ గ్రామాలకు చెందిన సుమారు 475 మంది రైతుల నుంచి భూములను తీసుకుంది. రైతుల నుంచి భూములను తీసుకునే ముందు అప్పటి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి జె.గీతారెడ్డి ఆదేశాలతో అప్పటి మెదక్ జిల్లా కలెక్టర్ వెంకటేశం, జాయింట్ కలెక్టర్ వాణీమోహన్‌లు ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో గ్రామ సభలను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించి, రైతులకు ఎకరాకు రూ. 5 లక్షలను కేటాయించడంతో పాటు ఇంటికో ఉద్యోగం ఇస్తామని, దాంతో పాటు భూములు కోల్పోయిన వారికి ఇంటి స్థలాన్ని ఇస్తామని హామీ ఇచ్చారు. అలాగే పరిశ్రమలలో ఉద్యోగాలు చేయాలంటే నైపుణ్యం ఉండాలని అందుకోసం పరిశ్రమలకు కేటాయించిన స్థలంలోనే ఐటీఐని ఏర్పాటు చేసిన శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించనున్నట్లు హామీ ఇచ్చారు. కానీ మరో వైపు పరిశ్రమల కోసం కేటాయించిన భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసినప్పటికి అప్పటి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేరలేదు.

కూలీలుగా మారిన రైతులు

ఇంటికో ఉద్యోగం హామీ నెరవేరకపోగా అదే పరిశ్రమలలో కూలీలుగా రైతులు మిగిలిపోయారు. కనీసం హామీ ప్రకారం ఐటీఐ ఏర్పాటు చేస్తే నాలుగు గ్రామాల ప్రజలు శిక్షణ పొంది పరిశ్రమలలో ఉద్యోగాలు చేసుకునే వారు. కానీ ఐటీఐ ఏర్పాటు చేయలేక పోయారు. దాంతో శిక్షణ లేకపోవండతో నైపుణ్యం లేదనే కారణంగా పరిశ్రమలలో కూలీలుగా పని చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి కూడా నెరవేరకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

మంత్రి స్పందనతో 75 మందికి పట్టాలు

అనంతరం టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులు స్థానిక నాయకులు, మెదక్ జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత శేఖర్‌గౌడ్, రాష్ట్ర ఫుడ్స్ చైర్మన్ గంగుమల్ల ఎలక్షన్‌రెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లారు. దాంతో వారు రాష్ట్ర మంత్రి హరీశ్‌రావ్ దృష్టికి తీసుకెళ్లారు. పలు మార్లు రైతులు కూడా మంత్రి హరీష్‌రావ్ దృష్టికి తీసుకెళ్లడంతో మంత్రి రైతుల ఆవేదనను గుర్తించి వారిని ఆదుకోవాలనే లక్ష్యంతో ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే రైతులకు ఇంటి స్థలాల పట్టాలను ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. దాంతో జనవరి 9న తూప్రాన్‌లో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో భూములు కోల్పోయిన 475 మంది రైతులకు పట్టాలను పంపిణీ చేశారు.

బీఆర్ఎస్ హయాంలో న్యాయం

బీఆర్ఎస్ హయాంలో తమకు న్యాయం జరిగిందని. ఇన్నాళ్ళ కల మంత్రి హరీశ్‌రావ్ ప్రోత్సాహంతో నెరవేరిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర మంత్రి హరీశ్‌రావ్ రైతుల ఆవేదనను గుర్తించి ఇండ్ల స్థలాల పట్టాలను మంజూరు చేయడంతో నాలుగు గ్రామాల రైతులు కాంగ్రెస్ ప్రభుత్వంలో భూములు తీసుకుంటే టీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు న్యాయం జరిగిందని ఆనందంతో కృతజ్ఞతలు తెలుపుతున్నారు. కాగా పరిశ్రమలకు కేటాయించిన స్థలంలోనే ఐటీఐ ఏర్పాటు కోసం జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత శేఖర్ గౌడ్ ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లారు. త్వరలోనే ఐటీఐ ఏర్పాటు కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు.

నాణ్యమైన సేవలు అందించాలి

కేర్ నర్సింగ్ హోమ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మదన్ రెడ్డి, సునీతా రెడ్డి



నవతెలంగాణ-కౌడిపల్లి

ప్రజలకు 24 గంటల పాటు అందుబాటులో ఉండి నాణ్యమైన సేవలు అందించే వైద్యులకు గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే మదన్ రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీత లక్ష్మారెడ్డి లు పేర్కొన్నారు. కౌడిపల్లిలో ఆదివారం కేర్ నర్సింగ్ హోమ్ ఆస్పత్రిని ప్రారంభించారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో వైద్యం పొందాలంటే మెదక్ హైదరాబాద్ వెళ్లాల్సి వస్తుందన్నారు. మంచి ఆలోచనతో ప్రజలకు అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్యం అందించాలన్న ఉద్దేశంతో కౌడిపల్లిలో ఆసుపత్రి ఏర్పాటు చేశామన్నారు. ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ నదీమ్ ఖాన్, మేనేజర్ మహమ్మద్ మన్సూర్, డాక్టర్లు భవాని, దినేష్, ఆస్పత్రి ఇన్చార్జిలు అజియాజ్, నరసింహ చారి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, గ్రంథాలయాల చైర్మన్ చంద్ర గౌడ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ హైమద్, రామా గౌడ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు గుంజరి ప్రవీణ్, ఎల్లం, రోజా రెడ్డి, దుర్గా రెడ్డి, జగన్, రవి సాగర్, అంజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తేవడానికి కృషి

మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ పటేల్



నవతెలంగాణ-వెల్దుర్తి

కాంగ్రెస్ అధిష్టానం పిలుపుమేరకు మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మహేందర్ రెడ్డి తెలిపారు. నర్సాపూర్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు రియాజ్ జనరల్ సెక్రెటరీ ప్రేమ్ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, ఆధ్వర్యంలో వెల్దుర్తి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా శ్రీకాంత్ పటేల్‌ను నియమించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికైన శ్రీకాంత్ పటేల్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తేవడానికి కృషి చేస్తానన్నారు. అందరితో కలగోల్పుగా ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

బంగారమ్మ నూతన ఆలయ ప్రారంభోత్సవం

హాజరైన ఎమ్మెల్యే మదన్ రెడ్డి



నవతెలంగాణ-నర్సాపూర్

శివంపేట మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన బంగారమ్మ దేవాలయ ప్రారంభోత్సవానికి నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి ఆదివారం హాజరయ్యారు. బంగారమ్మ దేవాలయంలో బంగారమ్మకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో శివంపేట జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా, హైకోర్టు న్యాయవాది శివకుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్, మండల కోశాధికారి, సేవ రత్న అవార్డు గ్రహీత బండారి గంగాధర్, గ్రామ సర్పంచ్ అనసూయ, అశోక్ గౌడ్, ఉప సర్పంచ్ సంధ్య, వెంకటస్వామి ఉన్నారు

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని పాములపర్తి గ్రామంలో నీల రాములు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఆదివారం మర్కుక్ బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షులు, సేవా రత్న అవార్డు గ్రహీత మేకల కనకయ్య ముదిరాజ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, 50 కిలోల బియ్యం, రూ.3 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాములపర్తి కర్ణాకర్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మహేష్, నర్సింలు, కొట్టాల మహేష్ తదితరులున్నారు.

పీఏసీఎస్ వైస్ చైర్మన్ భార్య జ్ఞాపకార్థం ఉచితంగా గుండె పరీక్షలు



నవతెలంగాణ-చేర్యాల

మండల పరిధిలోని కడవేరుగు గ్రామంలో ఆదివారం గ్రామానికి చెందిన పీఏసీఎస్ వైస్ చైర్మన్ తాళ్లపల్లి నర్సయ్య గుప్తా భార్య స్వర్గీయ వీరమణి జ్ఞాపకార్థం ప్రతిమ హాస్పిటల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత గుండె పరీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉచిత గుండె పరీక్షలు, జనరల్ ఫిజీషియన్ శిబిరాన్ని పీఏసీఎస్ వైస్ చైర్మన్ నర్సయ్య గుప్తా ప్రారంభించారు. ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకున్నారని గ్రామ మాజీ ఉప సర్పంచ్ తాళ్లపల్లి రమేష్ గుప్తా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గద రాజు యాదగిరి, ప్రజలు పాల్గొన్నారు.

మృతుడు రమేష్ కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన మంగళి రమేష్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఆదివారం బాధిత కుటుంబానికి మర్కుక్ ఎంపీపీ పాండుగౌడ్ రూ.4 వేలు ఇవ్వగా, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మర్కుక్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పిట్ల సత్యనారాయణ పరామర్శించి, రూ.4 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట కొత్వాల్ రాజు, మేకల రమేష్, శంకర్, కనకయ్య తదితరులున్నారు.

వాచ్ ఉమెన్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-చేర్యాల : చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌కు అనుసంధానమైన మోడల్ స్కూల్ బాలికల వసతి గృహంలో వాచ్ ఉమెన్ పోస్ట్ ఖాళీగా ఉన్నట్లు మండల విద్యాశాఖ అధికారి మొగుళ్ల నర్సింహారెడ్డి ఆదివారం తెలిపారు. 25 నుంచి 45 సంవత్సరాల వయసు కలిగి, పదవ తరగతి ఉత్తీర్ణులైన ఆసక్తి కలిగిన అభ్యర్థులను దరఖాస్తులను కోరుతున్నామన్నారు. ఈ నెల 23 నుంచి 28 వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మోడల్ స్కూల్, బాలికల వసతి గృహంలో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు పూర్తి వివరాలకు స్పెషల్ ఆఫీసర్ 7680946704కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

యూత్ కాంగ్రెస్ మండల కమిటీ ఎన్నిక

అధ్యక్షులుగా ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా రామాగౌడ్

నవతెలంగాణ-నర్సాపూర్

యూత్ కాంగ్రెస్ నర్సాపూర్ మండల కమిటీని ఆదివారం మెదక్‌లో యూత్ కాంగ్రెస్ మెదక్ జిల్లా అధ్యక్షులు మహేందర్ రెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గ అధ్యక్షులు రియాజ్ అలీ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. యూత్ కాంగ్రెస్ నర్సాపూర్ మండల అధ్యక్షులుగా నర్సాపూర్ మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ఆనంద్ కుమార్‌ను, ప్రధాన కార్యదర్శిగా ఇబ్రహీంబాద్ గ్రామానికి చెందిన రామాగౌడ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్, రామాగౌడ్‌లు మాట్లాడుతూ తమపై నమ్మకంతో అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నుకున్నందుకు నర్సాపూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీని గ్రామ గ్రామాన బలోపేతం చేస్తామన్నారు. గ్రామాల వారిగా యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేయడమే కాకుండా గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలో పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి చేపట్టనున్న హాత్‌సే హాత్ జూడో యాత్రను విజయవంతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. తమను యూత్ కాంగ్రెస్ నర్సాపూర్ మండలం అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నుకున్నందుకు జిల్లా అధ్యక్షులు మహేందర్ రెడ్డికి, నియోజకవర్గ అధ్యక్షులు రియాజ్ అలికి, తమ ఎంపికకు కృషి చేసిన పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డికి, రాష్ట్ర నాయకులు ఆంజనేయులు గౌడ్, సోమన్నగారి రవీందర్ రెడ్డిలకు, నర్సాపూర్ మండలంలోని కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులకు నూతన అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్, రామాగౌడ్‌లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



ప్రమాదవశాత్తు నివాస పూరి గుడిసె దగ్ధం





నవతెలంగాణ-చిన్నశంకరంపేట

అగ్ని ప్రమాదంతో నివాస పూరి గుడిసె దగ్ధమైన సంఘటన మల్లుపల్లిలో జరిగింది. బాధితుల కథనం ప్రకారం మండల పరిధిలోని మల్లు పల్లి గ్రామానికి చెందిన చౌదరిపల్లి నర్సింలు నివాస పూరి గుడిసే పూర్తిగా దగ్ధమైంది. శనివారం రాత్రి 10:30 గంటల సమయంలో అనుమానాస్పద స్థితిలో పూరిగుడిసెకు నిప్పు అంటుకుంది. ఇంట్లోని వస్తువులు, వంట సామాగ్రి, దుస్తులు పూర్తిగా కాలిపోయాయి, బాధితుని ముగ్గురి కుమారులకు సంబంధించిన పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ మెమోలు అన్ని కాలి బూడిదయ్యాయి. అరు నెలల క్రితమే పెద్ద కుమారుని పెళ్లి కావడంతో అతని వస్తువులు బెడ్ మంచం, బీరువా పూర్తిగా కాలిపోయాయి. 3,4 రోజుల క్రితం కుటుంబ సభ్యులందరూ బంధువుల పెళ్లి కోసం వెళ్ళారు. ఇంట్లో ఉన్న కొంత నగదు, అర తులం బంగారం, 20 తులాల వెండి, తదితర వస్తువులు మొత్తం కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారుగా లక్షా యాభై వేల రూపాయల అస్తి నష్టం జరిగినట్లు, తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

మండలంలోని మల్లుపల్లి గ్రామానికి చెందిన చౌదరి నరసింహులు నివాసముంటున్న పూరి గుడిసె దగ్ధమైన విషయం తెలుసుకున్న హైకోర్టు సీనియర్ న్యాయవాది బిజెపి సీనియర్ నాయకులు రాళ్లపల్లి రాజశేఖర్ బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఆయనతోపాటు బీజేపీ మండల అధ్యక్షులు పట్లోరి పోగుల రాజు, నాయకులు వనం నర్సింలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

249వ వారం స్వచ్ఛభారత్





నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

గ్రామ స్వచ్ఛతే లక్ష్యంగా నేచర్ ఐకాన్ యూత్ చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమం నేటితో 249వ వారానికి చేరుకుంది. మనోహరాబాద్ మండలం కూచారం గ్రామంలో నేచర్ ఐకాన్ యూత్ గత 249 వారాలుగా స్వచ్ఛభారత్ కార్యక్రమాలను చేపడుతుంది. ఆదివారం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా గ్రామంలో గ్రామీణ హరిత వనం చేపట్టారు. హరిత వనంలో అత్యంత అరుదైన అనేక రకాల పండ్లు, మెడిసిన్‌కు సంబందించిన మొక్కలను ఏర్పాటు చేశారు. ప్రతి నిత్యం మొక్కల సంరక్షణ కోసం యువతే దగ్గరుండి మొక్కలను పెంచుతున్నారు. 249వ వారం హరిత వనంలోని మొక్కల వద్ద పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి పాదులను తీసి రక్షణ ఏర్పాట్లను చేశారు. యువతతో పాటు గ్రామంలోని చిన్నారులు సైతం తాము కూడా స్వచ్ఛభారత్‌లో పాలుపంచుకుంటామంటూ యువతతో కలిసి శుభ్రతలో పాలుపంచుకుంటున్నారు. కూచారం గ్రామంలో నేచర్‌ఐకాన్ యువతతో పాటు చిన్నారులు చేపడుతున్న స్వచ్ఛభారత్ ఇతర గ్రామాలు మండలాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. యువతకు గ్రామ సర్పంచ్ జక్కిడి నరెందర్‌రెడ్డి ఇస్తున్న ప్రోత్సాహంతోనే యువత స్వచ్ఛభారత్‌లో ముందుకు వెళుతున్నట్టు తెలిపారు.

పల్లెపల్లెకు సుల్తానా సేవలు



నవతెలంగాణ-దుబ్బాక రూరల్ : పల్లెలు పట్టణాలను తేడా లేకుండా ఆపద అని తెలిస్తే చాలు పరమావధిగా కష్టాలలో ఉన్న వారి కన్నీళ్లు తుడవడమే నిజమైన మానవత్వమని పల్లె పల్లెకు తిరుగుతూ నిరుపేద ప్రజలకు సేవ చేస్తూ మానవత్వానికి నిదర్శనంగా నిలుస్తున్నారు సామాజిక ప్రజా సేవకురాలు, ఇందుప్రియాల్ అంగన్వాడి టీచర్ మహమ్మద్ సుల్తాన ఉమర్. దుబ్బాక మండలం చెర్వపూర్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన పిట్ల వెంకటయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఆదివారం వారి కుటుంబాన్ని పరామర్శించి నిత్యవసర సరుకులు, బియ్యం, ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఊరు ప్రాంతం తేడా లేకుండా నిరుపేద ప్రజలు ఎక్కడ ఆపదలో ఉంటే అక్కడికి వెళ్లి తమ వంతు సహాయం చేసి ఆదుకుంటున్నామన్నారు. చేర్వపూర్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన పిట్ల వెంకటయ్య అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం చాలా బాధాకరమని, అతనికి భార్య లక్ష్మి, ముగ్గురు కూతురులు రేణుక, యాదమ్మ, లావణ్య ఉన్నారు. కూతురుల వివాహాల కోసం ఉన్న కాస్త ఆస్తిపాస్తులు అమ్మేసి వారి పెళ్లిళ్ల చేశారు. ఇప్పుడు నివాసం ఉండడానికి చిన్నపాటి ఇల్లు మాత్రమే మిగిలింది. వెంకటయ్య భార్య లక్ష్మి కూడా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. వీరి పరిస్థితి చాలా విషాదకరంగా ఉందన్నారు. తన వంతుగా వీరి కుటుంబానికి సహకారం అందించామన్నారు. మానవతావాదులు, స్వచ్ఛంద సంస్థలు ఎవరైనా ముందుకు వచ్చి వీరి కుటుంబానికి సహాయం చేసి మానవత్వాన్ని చాటుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు మూర్తి నరేష్ రెడ్డి, గ్రామస్తులు మంద శ్రీనివాస్, నరేష్, యాదగిరి, ఎల్లం, హరీష్, వంశీ, నరేందర్, మహమ్మద్ ఉమర్, ఇమ్రాన్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ ఆసుపత్రి సౌజన్యంతో కర్కపట్లలో ఉచిత వైద్య శిబిరం






నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని కర్కపట్ల గ్రామ పంచాయతీ పాలక మండలి అధ్వర్యంలో కండ్లకోయ మేడ్చల్ సీఎంఆర్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని అంగన్ వాడీ కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు 150 మందికి పరీక్షలు నిర్వహించి, సీఎంఆర్ ఆసుపత్రి చైర్మన్ సి.గోపాల్ రెడ్డి, డైరెక్టర్ డా.అలీ బేగ్, ప్రో జె దురా ప్రసాద్ రెడ్డి, మార్కెటింగ్ సూపర్‌వైజర్ మధు యాదవ్, వైద్యులు డా.వేణు కుమార్, రియాజ నేతృత్వంలో అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈసీజీ, టుడీకో, ఎక్స్‌రేలు మెరుగైన చికిత్స అవసరమున్న వారిని కండ్లకోయ మేడ్చల్ సీఎంఆర్ ఆసుపత్రికి బస్సులో తీసుకెళ్ళి పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేయనున్నామని డాక్టర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నర్సింలు, మాజీ సర్పంచ్ సుగుణాకర్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బింగి శ్రీశైలం యాదవ్, ఉపసర్పంచ్ అఫ్సర్వార్, వార్డు సభ్యులు రాళ్ళబండి బాలకిషన్, ప్రవీణ్, మధు నాయకులు ఐలేని, నర్సింలు గౌడ్, మధు, గణేష్, తదితరులున్నారు.

విద్యార్థులకు రెండు జతల దుప్పట్లు పంపిణీ చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరవింద్



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్ల కొరత లేకుండా ప్రతి విద్యార్థికి రెండు జతల దుప్పట్లు పంపిణీ చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తడకపల్లి బాలుర హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రెడ్డమైన అరవింద్ మాట్లాడుతూ హాస్టల్లో సరైన మౌలిక వసతులు లేకపోవడం వల్ల విద్యార్థులు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేద వ్యక్తం చేశారు. హాస్టల్ పరిసర ప్రాంతాలు కూడా అపరిశుభ్రంగా ఉన్నాయని, దీంతో దోమలు వస్తున్నాయన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా చేసి దోమలు రాకుండా విద్యార్థుల ఆరోగ్యం పాడవకుండా చూడాలన్నారు. హాస్టల్లో వంట చేసే వర్కర్స్ కు జీతాలు సరిగ్గా రావడం లేదన్నారు. ఎనిమిది నెలల నుంచి బకాయిలు ఉండడం విడ్డూరమన్నారు. హాస్టల్లో చదివే విద్యార్థులకు వైద్య సౌకర్యం కూడా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి నవీన్, నాయకులు నాగరాజు, సాయి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక గ్రంథాల ధర్మ ప్రచారం



నవతెలంగాణ-మర్కుక్ : ఆత్మల వివరణ తెలుసుకోవడమే మానవునికి నిజమైన ఆధ్యాత్మికమవుతుందని, ఆత్మ ఆచరణ లేనిది ఎన్ని ఆచారాలు ఆచరించినా ఫలితం లేదని ప్రబోధ సేవా సమితి యాదాద్రి భువనగిరి కమిటీ సభ్యులు దేవేందర్ అన్నారు. ఆదివారం మండలంలోని చేబర్తి, అంగడికిష్టాపూర్ గ్రామాలలో భగవద్గీత త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథముల ధర్మ ప్రచారం ఇంటింటా నిర్వహించారు. సెలవు దినాలలో ప్రతి గ్రామంలో ఈ ప్రచారం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి సభ్యులు దేవేందర్, శంకర్, లక్ష్మీనారాయణ, లింగస్వామి, నరేష్, లతా, ధనలక్ష్మి లలిత, రేణుక తదితరులున్నారు.

ఖేలో ఇండియా ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం



నవతెలంగాణ-వర్గల్

మండలంలోని మహాత్మజ్యోతి బాపులే మహిళ గురుకులంలో ఖేలో ఇండియా పోటీలలో భాగంగా ఆదివారం ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌ను ఎఫ్‌డీసీ చెర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యమానికి ముఖ్య అతిథులుగా ఇంటర్నేషనల్ ఫుట్‌బాల్ ప్లేయర్, తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఫాల్గుణ హాజరయ్యారు. ఈ సందర్భంగా గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ఈ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను గజ్వేల్ ఫుట్‌బాల్ క్లబ్, మహాత్మా జ్యోతిబాపులే మహిళ గురుకులం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. టోర్నమెంట్ నిర్వహించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ టోర్నమెంట్ 27వ తేది వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్గల్ మండల జెడ్పీటీసీ బాలమల్లు యాదవ్, ఎపీపీ జాలిగామ లత, పీఏసీఎస్ చైర్మన్ ఇర్రి రామకృష్ణ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, కరుణాకర్, తుమ్మ గణేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ విజేతలకు బహుమతుల అందజేత



నవతెలంగాణ-నంగునూరు

గట్ల మల్యాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ఆయిల్ ఫామ్ రైతు సంఘం ఉపాధ్యక్షులు ఎడ్ల సోమిరెడ్డి ఆర్థిక సహకారంతో గ్రామంలోని యువకులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో దాదాపుగా 10 జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి అధ్యక్షులుగా చిలుక వెంకటయ్య, విశిష్ట అతిథిగా ఎడ్ల సోమిరెడ్డి, ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ తిప్పని రమేష్, ఆత్మీయ అతిథులుగా మండల ఉపాధ్యక్షులు కర్ణకంటి రేణుక వేణుగోపాల్ చారిలు పాల్గొని విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. మొదటి విజేతగా మంగళారపు రాజు అండ్ టీంకు రూ.2 వేలు, రెండవ విజేతగా ఇరగదిండ్ల శ్రీకాంత్ అండ్ టీంకు రూ.1000 నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కోల రమేష్ గౌడ్, జీఎంఈఏ ప్రధాన కార్యదర్శి తిప్పని రవీందర్, ముగ్దుంపూర్ వ్యాయామ ఉపాధ్యాయుడు రాజు, బంటు బాబు, తదితరులు పాల్గొన్నారు.

హైద్రాబాద్‌కు వెళ్ళకుండా ఉపాధ్యాయులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

నవతెలంగాణ-కోహెడ



317 జీవోపై ప్రభుత్వ పునరాలోచించాలని ఉపాధ్యాయులు రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన ఛలో హైద్రాబాద్ బేగంపేట క్యాంప్ ఆఫీస్ ముట్టడి పిలుపు మేరకు ఉపాధ్యాయులు వెళ్ళకుండా అదుపులోకి తీసుకున్నట్లు డీటీఎఫ్ జిల్లా కౌన్సిలర్ బండి సమ్మయ్య తెలిపారు. ఆదివారం హైద్రాబాద్‌కు వెళ్ళకుండా ఆయనను కోహెడ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు అదుపులోకి తీసుకొని స్వంత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, అరెస్టులతో సమస్యలు పరిష్కారం కావని, ఇప్పటికైన ప్రభుత్వం పునరాలోచించాలని 317 జీవోను రద్దు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

పీఆర్‌టీయూ నాయకుల అక్రమ అరెస్టుకు నిరసన

317 ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-గజ్వేల్

317 జీవో ఉపాధ్యాయులకు, ప్రభుత్వానికి సమన్వయం చేస్తూ వాళ్ల సమస్యలు పరిష్కరించడానికి పీఆర్‌టీయూ సంఘం కృషి చేస్తుందని పీఆర్‌టీయూ నాయకులు ఊడెం జైపాల్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, ఊడెం వేమారెడ్డి అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ గజ్వేల్‌లో ఉదయం 5 గంటలకు పీఆర్‌టీయూ నాయకులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అలాగే 317 జి.వో.తో వేరే జిల్లాలకు కేటాయించిన ఉపాధ్యాయులందరినీ వారి వారి జిల్లాలకు స్పౌజ్‌లకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో వర్గల్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, రాయపోల్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు కే హనుమంత రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కనక రాములు తిరుపతిరెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు నాగరాజు, వేణు, గోవర్ధన్, గోపాల్ ఉన్నారు.

బీఆర్ఎస్ పార్టీ దేశంలో అజేయ శక్తిగా నిలవనుంది



మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

నవతెలంగాణ-గజ్వేల్

సీఎం కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ పార్టీ దేశంలో ఒక అజేయ శక్తిగా నిలువనున్నదని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సి రాజమౌళి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ధృఢ సంకల్పంతో మొక్కవోని దీక్షతో ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి నిరాహార దీక్ష చేసి తెలంగాణ ప్రజల చిరకాల వాంఛ స్వరాష్ట్రాన్ని సాధించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. దేశంలో అగ్రగామిగా అన్ని రంగాల ప్రజలు అభివృద్ధి ధ్యేయంగా రైతులు, శ్రామికులు, కర్షకుల ముఖాల్లో సంతోషం కలిగించే పరిపాలన కొనసాగిస్తూ ఇటీవల టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్ పార్టీగా అవతరించిందన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో భారతదేశంలో ఒక విప్లవాత్మక మార్పు రావడం ఖాయమని, బంగారు భారతదేశం సీఎం కేసీఆర్ వల్లనే సాధ్యమవుతుందని ప్రజలు విశ్వాసంతో ఉన్నారన్నారు.

రక్తదానం చేసిన యువకుడు



నవతెలంగాణ -గజ్వేల్

ములుగు మండలం ఆర్విఎం ఆస్పత్రిలో మహిళ నర్సమ్మకు రక్తం అవసరం ఉందని సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆదివారం గజ్వేల్ పట్టణానికి చెందిన అల్ మదాద్ ఉమతి ఫౌండేషన్ సభ్యులు ముక్తార్ స్పందించి ఆమెకు రక్తదానం చేశారు. స్వచ్ఛంద సంస్థ సభ్యులు ప్రతి ఆపద విషయంలో స్పందిస్తున్నారని ఆత్మ కమిటీ డైరెక్టర్ కూరాకుల సాయికుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఖలీల్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

చర్చికి ఫిల్పిట్ అందజేత



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం నందారం గ్రామంలోని బేతెలు ప్రార్థన మందిరంలో పాస్టర్ బోధించేందుకు ఉపయోగించే పిల్పిట్‌ను ఆర్మీ జవాన్ కరివేద సంజీవరెడ్డి బహూకరించారు. ఈ పిల్పిట్‌ను ఆదివారం బేతెలు ప్రార్థన మందిరం పాస్టర్ మేకల దయాకర్ ఆధ్వర్యంలో ఆర్మీ జవాన్ కరివేద సంజీవరెడ్డి, ఉప సర్పంచ్ కొట్టే శ్రీనివాస్ రెడ్డిలు ప్రారంబించారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ చర్చ్‌కు సంబంధించి ఏలాంటి కార్యక్రమాలు చేసినా వాటికి సహకరిస్తున్నారన్నారు. వీటితో పాటు గ్రామంలో ఎలాంటి పనులు జరిగినా సహకరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్చ్ పెద్దలు లింగాల అబ్రహం, పెరుక జకరయ్య, పెరుక ఎలీషా, లింగాల సుధాకర్, లింగాల ప్రేమ్ నగర్, లింగాల ప్రవీణ్, పెరుక సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు గణేష్ పల్లిలో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు



సర్పంచ్ మెతుకు మంజుల శీరాములు

నవతెలంగాణ-మర్కుక్

మండలం గణేష్ పల్లి గ్రామంలో ప్రధాన కూడలిలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు గణేష్ పల్లి సర్పంచ్ మెతుకు మంజుల శ్రీరాములు తెలిపారు. యువతకు స్ఫూర్తి ప్రదాత సుభాష్ చంద్రబోస్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకల్లో ప్రజా ప్రతినిదులు, యువకులు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం



నవతెలంగాణ-సిద్దిపేట

317 ఉత్తర్వులో జరిగిన అన్యాన్ని సవరించాలని, బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కొంత మంది పిలుపునిస్తే, జిల్లా వ్యాప్తంగా టీపీటీఎఫ్ నాయకులను శనివారం రాత్రి నుంచి అరెస్టు చేయడాన్ని మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తిరుపతి రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులను అరెస్టు చేస్తే సమస్య పరిష్కారం కాదని, విద్యాశాఖ మంత్రి, అధికారులు చిత్త శుద్ధితో ఆలోచించి, భార్యా భర్తల, స్థానికత అంశంపై పునరాలోచన చేయాలని కోరారు. ప్రభుత్వం సమస్య పరిష్కారం కోసం కృషి చేయకపోవడం మూలంగానే ఉపాధ్యాయులు వారి ఆందోళన విభిన్న రూపాల్లో కొనసాగిస్తున్నారని అన్నారు. ఉద్యమాలను అవహేళన చేస్తూ, ఉపాధ్యాయులను విద్యాశాఖ డైరెక్టర్ రౌడీలని కించ పరుస్తూ సంభోదించడాన్ని టీపీటీఎఫ్ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొన్నమల రాములు, జిల్లా అధ్యక్షులు సీహెచ్.విజేందర్ రెడ్డి, జిల్లా నాయకులు పద్మయ్య, జానకి రాములు, సత్యనారాయణ, శివాజీ, నర్సింహ్మారెడ్డి, మల్లేషం, సత్యకృష్ణ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ నాయకులు అరెస్టును ఖండిస్తున్నాం

నవతెలంగాణ-సిద్దిపేట

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తున్న సంఘం పీఆర్‌టీయూ అని, సంఘ నాయకులను అరెస్టు చేయడాన్ని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఆదరాసుపల్లి శశిధర్ శర్మ, గౌరవ అధ్యక్షులు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి పంతం వెంకటరాజంలు తీవ్రంగా ఖండించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం 50 ఏళ్లుగా నిరంతరం కృషి చేస్తున్న సంఘం పీఆర్‌టీయూ అని అన్నారు. అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలని కోరారు.

శ్రీగిరిపల్లిలో మోడల్ పంచాయతీ భవనం

- రూ.26.75 కోట్లతో గ్రామపంచాయతీలకు భవనాలు



నవతెలంగాణ -గజ్వేల్

తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గ్రామ పంచాయతీ కార్యాలయాలకు మెడల్ భవనాలను మంజూరు చేసి నిర్మించింది. గజ్వేల్ నియోజకవర్గంలో 177 గ్రామ పంచాయతీలో భవనాలు లేనిచోట వెంటనే నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామపంచాయతీలో పాశుధ్య పనులు, ఇంటింటికి చెత్త సేకరణ, గ్రామంలో మౌలిక వసతులు కల్పన, అభివృద్ధి పనులు జోరుగా కొనసాగుతున్నాయి. గజ్వేల్ నియోజకవర్గంలో 107 గ్రామ పంచాయతీలకు రూ.27,78 కోట్ల మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీ భవనాల నిర్మాణం పనులు అన్ని గ్రామాల్లో ముమ్మరంగా జరుగుతున్నాయి. కొన్నిచోట్ల పనులు పూర్తయ్యాయి. మరికొన్ని చోట్ల పనులు కొనసాగుతున్నాయి. కొన్ని గ్రామపంచాయతీలో ప్రతిపాదన పంపారు. రాష్ట్ర ఆర్థిక ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు, ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనల మేరకు పక్కా భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గజ్వేల్ నియోజకవర్గంలో ఎన్ని గ్రామపంచాయతీలు ఉన్నాయి? ఎన్ని గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలు ఉన్నాయి? గ్రామాల్లో పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి స్థలం ఉందా? అనే విషయాలను అధికారులు తెలుసుకొని ప్రభుత్వానికి ప్రతిపాదనను పంపారు. గజ్వేల్, వర్గల్, ములుగు, మర్కుక్, కొండపాక, మనోరబాద్, తూప్రాన్, జగదేవ్పూర్ తదితర మండలంలో నూతన గ్రామపంచాయతీ భవనాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగానే గజ్వేల్ మండలంలో 13, కొండపాక మండలంలో 8, జగదేవపూర్ మండలంలో 20, వర్గల్ మండలంలో 23,, ములుగు మండలంలో 12, మర్కుక మండలంలో 13, తూప్రాన్ మండలంలో 9, మనోహరాబాద్ మండలంలో 9 గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణాలకు తెలంగాణ ప్రభుత్వం ఒక్కోదానికి రూ.25 లక్షలు మంజూరు చేసింది. నియోజకవర్గంలోని ప్రతి గ్రామపంచాయతీ భవన డిజైన్ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆమోదించిన తర్వాతనే నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నారు. సంబంధిత శాఖ అధికార ద్వారా నివేదికలు తెప్పించుకుంటున్నారు. సర్పంచ్, కార్యదర్శికి వేర్వేరు గదులు నిర్మిస్తున్నారు. సామగ్రి భద్రపరిచేందుకు, ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు వీలుగా మరో గదిని నిర్మిస్తున్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో నిర్మించే గ్రామ పంచాయతీ భవనం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలని సీఎం కేసీఆర్ సూచించిన విధంగా ఉండాలని అధికారులు భావిస్తున్నారు.

అభివృద్ధికి బాటలు



గజ్వేల్ నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం బాటలు వేస్తుంది. గతంలో ఏ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని పట్టించుకోలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడడం గజ్వేల్ నుంచి ఎమ్మెల్యేగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఉండడం మేము చేసుకున్న అదృష్టం. మంత్రి హరీష్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి కృషితో పనులు కొనసాగుతున్నాయి. గ్రామాల రూపురేఖలు మారుతున్నాయి. గజ్వేల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదు. గ్రామంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు కృషి చేస్తున్నాం.

- చెరుకు చంద్రమోహన్ రెడ్డి. శ్రీగిరిపల్లి సర్పంచ్

పనులు కొనసాగుతున్నాయి



ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి హరీష్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి కృషితో నిధులు మంజూరు అవుతున్నాయి. గ్రామంలో సీసీరోడ్లు, మురికి కాలువలు, డంపుయార్డు, చెత్త సేకరణ, పారిశుధ్య పనులు, పక్కా భవనాల నిర్మాణాల పనులు కొనసాగుతున్నాయి. అన్ని గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ నిధులు మంజూరు చేస్తున్నారు.

- జయ్యారం సర్పంచ్ మద్దూరు శ్రీనివాస్‌రెడ్డి

మత్స్య సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

నవతెలంగాణ-నంగునూరు



మత్స్య కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జిల్లా మత్స్యశాఖ అధికారి మల్లేశం అన్నారు. ఆదివారం నంగునూరు మండల కేంద్రంలోని మైసమ్మ చెరువులో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా అర్హులైన మత్స్య కార్మికులకు వృత్తి నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. నంగునూరు-159, ఘనపూర్-12, కోనాయిపల్లి-43, గ్రామాల్లోని మత్స్యకారులు పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర ఆయిల్ ఫామ్ రైతు వెల్ఫేర్ ఉపాధ్యక్షులు ఎడ్ల సోమిరెడ్డి, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు చౌడుచర్ల జయపాల్ రెడ్డి, నల్ల పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కోల మహేందర్ గౌడ్, సొసైటి చైర్మన్ కోల రమేష్ గౌడ్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. మంత్రి ఆదేశాల మేరకు సిద్దిపేట నియోజకవర్గంలోని నంగునూరు మండలానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. నీటి విస్తీర్ణం పెరగడంతో 18 సంవత్సరాలు నిండిన ప్రతి మత్స్య కార్మికునికి సభ్యత్వం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉందన్నారు. వృత్తిపై అవగాహన పెంచుకుంటే జీవనోపాధికి ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల డిఎఫ్ఓ శివప్రసాద్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుపాకుల బాలరంగం, రాష్ట్ర కార్యదర్శి ధర్మా ముదిరాజ్, మండల అధ్యక్షుడు పిల్లి నారాయణ, ఉపాధ్యక్షుడు గౌరవేని స్వామి, మత్స్య కార్మికులు సొప్పరి సాయిలు, గౌరబోయిన కనకయ్య, నర్సింలు, కొండిల్ల రాజు, కనకరాజు, ప్రశాంత్, నాయకులు మహేందర్ రెడ్డి, కనకయ్య, శ్రీకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపూర్‌లో డ్రైనేజ్ సమస్య పరిష్కరించాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మామిడాల కనకయ్య



నవతెలంగాణ- సిద్దిపేటరూరల్

గ్రామంలో డ్రైనేజ్ సమస్య వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మామిడాల కనకయ్య అన్నారు. ఆదివారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో సీపీఐ(ఎం) గ్రామ శాఖ సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజ్ సమస్య వల్ల దోమలు, ఈగలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, వంటి వ్యాధులు సోకుతున్నా, గ్రామపంచాయతీ సిబ్బంది, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. అలాగే గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలన్నారు. ఇల్లు లేని వారు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇళ్ల స్థలం ఉన్నవారిని గుర్తించి వారికి ఇల్లు కట్టడానికి ఆర్థిక సాయం అందించా లన్నారు. ఎన్నికలలో కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు భూమి లేని నిరుపేదలకు మూడెకరాల భూమి అర్హులైన వారిని గుర్తించి పంపిణీ చేయాలన్నారు. అలాగే దళిత బంధు ధనవంతులకు కాకుండా నిజమైన నిరుపేద దళితులకు మాత్రమే పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డమైన అరవింద్, మండల కమిటీ సభ్యులు చింతల వెంకటయ్య, కర్రోల్ల నవీన్, మల్లేశం, యాదయ్య, కనకయ్య, రజియా, తదితరులు పరుశరాములు పాల్గొన్నారు.

క్రికెట్ క్రీడల్లో యువత రాణించాలి

నవతెలంగాణ-మద్దూరు



క్రికెట్ క్రీడల్లో యువత రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపిక కావాలని మద్దూరు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్ కుమార్ అన్నారు. గాగిలాపూర్ గ్రామంలో గాగిలాపూర్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి నిర్వహించిన క్రికెట్ క్రీడోత్సవాల ముగింపు కార్యక్రమానికి మేక సంతోష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై సర్పంచ్ బొల్లు కృష్ణవేణి చంద్రమౌళితో కలిసి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం మేక సంతోష్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో జరిగే క్రికెట్ క్రీడల్లో యువత రాణించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికయ్యేందుకు కష్టపడాలని ఆయన కోరారు. క్రీడలతో స్నేహభావం శారీరక ధృఢత్వం మానసిక ఉల్లాసం పెరుగుతుందని ఆయన తెలిపారు డివిజన్ స్థాయి క్రికెట్ క్రీడల్లో మద్దూరు ప్రథమ స్థానంలో గెలుపొందడంతో ట్రోఫీ రూ.10వేలు, ద్వితీయ స్థానంలో గాగిల్లాపూర్ గెలుపొందగా ట్రోఫీ రూ.6 వేల నగదును విజేతలకు అందించినట్లు ఆయన తెలిపారు ఉప సర్పంచ్ మేక మాధవి గోపాల్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఏలూరి కృష్ణ, గ్రామస్తులు, క్రికెట్ అసోసియేషన్ నిర్వాహకులు క్రీడాకారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడలు నిర్వహించడం గర్వకారణం

- ఏఎంసీ వైస్ చైర్మన్ ఉపేందర్ రెడ్డి



నవతెలంగాణ-జగదేవపూర్

గ్రామీణ యువత క్రీడలతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని గజ్వేల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఉపేందర్ రెడ్డి అన్నారు. జగదేవపూర్ మండల కేంద్రంలో సర్పంచ్‌ల ఫోరమ్ మండల అధ్యక్షుడు రచర్ల నరేష్ ఆధ్వర్యంలో జరుగుతున్న కేసీఆర్ క్రికెట్ కప్ రాష్ట్రస్థాయి టోర్నీని ఏఎంసీ వైస్ చైర్మన్ ఉపేందర్ రెడ్డి పాల్గొని ప్రారంభించారు. దౌలపూర్ క్రీడాకారులకు క్రీడా దుస్తులు, క్రికెట్ కిట్టు కోసం రూ.10 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా ప్రతిభ కనబరచుకోవడంతోపాటు ఆరోగ్యం, స్నేహం పెంపొందించుకోవచ్చని సూచించారు. నరేష్ కూడా సొంత ఖర్చులతో ఇంత పెద్ద రాష్ట్ర స్థాయి క్రీడలు నిర్వహించి జగదేవపూర్ మండలానికి పేరు తీసుకురావడం గొప్ప విషయమన్నారు. గ్రామీణ క్రీడాకారులు ఇలాంటి టోర్నీలో పాల్గొని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దౌలాపూర్ క్రీడాకారులు, నిర్వాహకులు బండ శ్రీను, స్థానిక యువకులు పాల్గొన్నారు.

మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా దూలం శ్రీనివాస్‌గౌడ్

నవతెలంగాణ-కోహెడ



కోహెడ మండలంలోని వింజపల్లి గ్రామానికి చెందిన దూలం శ్రీనివాస్‌గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ యువజన మండల అధ్యక్షుడిగా నియామకమైనట్లు జిల్లా యువజన అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షారెడ్డి చేతుల మీదుగా జిల్లా కేంద్రంలో నియామక పత్రాన్ని అందుకున్నారు. ఆదివారం ఆయన మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో యువజన మండల బాధ్యతలు ఇచ్చినందుకు శక్తి వంచన లేకుండా పని చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని కోరారు. తన నియామకానికి సహకరించిన కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, జిల్లా అధ్యక్షులు ఆంక్షారెడ్డి హుస్నాబాద్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బీనవేని రాకేష్, మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతకింది శంకర్, సీనియర్ నాయకులు నంగునూరి శ్రీనివాస్, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి

ఎంపీపీ దాసరి అమరావతి శ్యాం మనోహర్



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని గజ్వేల్ మండల పరిషత్ అధ్యక్షురాలు దాసరి అమరావతి శ్యామ్ మనోహర్ అన్నారు. నవ తెలంగాణతో ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేశారని చెప్పారు. నియోజకవర్గంలో రూ.13.25 కోట్లతో గ్రామీణ ప్రాంతంలో సీసీరోడ్లు, మురికి కాలువల నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. గజ్వేల్ మండలానికి రెండు కోట్ల 35 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ములుగు మండలానికి రెండు కోట్ల 30 లక్షల మంజూరు చేసినట్లు చెప్పారు. వర్గల్ మండలానికి రెండు కోట్ల 95 లక్షలు, మర్కుక మండలానికి కోటి 50 లక్షలు, జగదేవ్పూర్ మండలానికి రెండు కోట్ల 45 లక్షలు, కొండపాక ఉమ్మడి మండలానికి కోటి 70 లక్షలు నిధులు కేటాయించినట్లు చెప్పారు. గ్రామాలు అభివృద్ధి పథంలో నడిపేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీష్ రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి కృషితో నిధులు మంజూరైనట్లు అన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు దశలవారీగా నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. మండలాల అభివృద్ధి కేసీఆర్‌తో సాధ్యమని, గత ఎనిమిది సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తూ స్థానిక ప్రజా ప్రతినిధులకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తంచేశారు.


కారోబార్‌ల ఛలో హైద్రాబాద్‌ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కోహెడ



గ్రామపంచాయతీ, బిల్ కలెక్టర్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు మెట్టు వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఈ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యాక్షుడు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్, పంచాయితీరాజ్ కమీషనర్ హనుమంతరావులు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి కారోబార్‌లు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తలారి అనిల్‌కుమార్, మౌటం సంపత్, బందెల మల్లేశం, అరిగే సంపత్, యాటెల్లి వేణు, రాజులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ వైపు యువత చూపు



నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు గజ్వేల్ బీఆర్ఎస్ పార్టీ యూత్ నేత గాడిపల్లి అనూఫ్ అన్నారు. నవతెలంగాణతో ఆయన మాట్లాడుతూ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో యువత బీఆర్ఎస్ పార్టీ వైపు చూస్తుందని చెప్పారు. ప్రతి వార్డులో యూత్ పార్టీలోకి రావాలని చర్చలు జరుపుతున్నామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీష్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిల కృషితో పార్టీ మరింత బలోపేతం అవుతుందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు తిరిగి అధికారంలోకి తెస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో అన్ని వార్డులో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు నాయకులు కృషి చేస్తున్నారని చెప్పారు. కెసిఆర్ కిట్టు, రైతు బీమా, రైతు బంధువు, ఆసరపెంచిని, కళ్యాణ్ లక్ష్మి, షాదీ ముబారక్ తదితర పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. తెలంగాణ సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. సంక్షేమ పథకాలు ప్రజలందరికి చేరుతున్నాయని తెలిపారు. గజ్వేల్ మున్సిపల్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు.

దాతర్‌పల్లిలో చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

భారతదేశంలో భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు చేసిన మొదటి మహిళ వీరనారి చాకలి ఐలమ్మ అని కొండపాక ఎంపీపీ రాగళ్ల సుగుణ దుర్గయ్య అన్నారు. ఆదివారం గజ్వేల్ మండలం దాతర్‌పల్లిలో రజక సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ వీరనారి రజక ముద్దుబిడ్డ చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగాల శ్రీమతి బొమ్మరాజు ప్రియాంక అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గజ్వేల్ హాజరై విగ్రహావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ భారతదేశంలో భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు చేసిన మొదటి మహిళగా చరిత్రలో మిగిలిపోయారన్నారు. తెలంగాణ అంశానికి వస్తే సాయుధ తెలంగాణా పోరాటంలో నేటి ప్రజాప్రతినిధులకు దిక్సూచిగా మిగిలారన్నారు. భూమికోసం, భుక్తి కోసం మొదటగా పోరాటం చేసిన మహిళ గుర్తింపు పొందారన్నారు. తెలంగాణలో సాయుధ తెలంగాణా పోరాటం రజాకార్ ఉద్యమాలను ఎదుర్కొని వీరనారిగా కీర్తిని గడించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూపల్లి సత్యనారాయణ, దాతర్ పల్లి రజక సంఘం అధ్యక్షులు ఉపాధ్యక్షులు జూపల్లి మల్లేశం, కోశాధికారి జూపల్లి రవి, కార్యదర్శి జూపల్లి బాలనర్సు, జూపల్లి కరుణాకర్, జూపల్లి లక్ష్మన్, రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాము గారి శ్రీధర్, దుబ్బాక నియోజకవర్గం బీఎస్పీ ఇంచార్జ్ ముత్యాల నరసింహులు, జగదేవపూర్ మండలాధ్యక్షులు రాచమల్ల ఎల్లేష్ , నంగునూరు ఎంపీటీసీ బాబు, నాగపురి సర్పంచ్ కరుణాకర్, జగదేవపూర్ మండల రజక సభ్యులు బాల్ నర్సయ్య, గజ్వేల్ మండల రజక అధ్యక్షులు శివ రాజయ్య, మల్లేశం, ప్రవీణ్, కుకునూర్ పల్లి మండల గౌరవ అధ్యక్షులు రాజశేఖర్, చేర్యాల మండల రజక నాయకులు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు

9వ వార్డు కౌన్సిలర్ మామిడి విద్యారాణి శ్రీధర్



నవతెలంగాణ-గజ్వేల్

ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నానని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ 9వ వార్డు కౌన్సిలర్ మామిడి విద్యారాణి శ్రీధర్ అన్నారు. ఆమె నవ తెలంగాణతో మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా వార్డులో నిత్యం తిరుగుతూ ప్రజా సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. తక్షణ పస్కారానికి కృషి చేస్తున్నామన్నారు. తన పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నానని తెలిపారు. మిగతా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుపోతున్నట్లు చెప్పారు. ఇటీవల గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌కు రూ.23 కోట్లు మంజూరు కాగా తొమ్మిదో వార్డు అభివృద్ధికి రూ.38 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. వార్డులో చాలా వరకు సీసీరోడ్లు ఉన్నాయని, ఇంద్రపార్క్, కోట మైసమ్మ రోడ్డు విస్తరణలో భాగంగా ఇల్లు కోల్పోతున్న వారందరినీ ఆదుకునేందుకు మంత్రి హరీష్ రావు, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, కమిషనర్ విద్యాధర్ దృష్టికి తీసుకుపోయినట్లు చెప్పారు. కొందరికి ఇప్పటికే డబల్ బెడ్ రూమ్ ఇచ్చామని, మరికొందరు లబ్ధిదారులను గుర్తించి డబుల్ బెడ్ రూమ్ ఇస్తామన్నారు. కోట మైసమ్మ ఇంద్ర పార్క్ రోడ్డు పూర్తి అయితే మోడల్ రోడ్డుగా మారుతుందని చెప్పారు. ఇందుకుగాను స్థానిక ప్రజలు సహకరించాలన్నారు. 9వ వార్డు పరిధిలోకి వచ్చే రోడ్డు మార్గాన ఇంకా ఒకటి రెండు ఇండ్లు మాత్రమే ఉన్నాయన్నారు. మిగతా ఇంట్లు ఇతర వార్డు పరిధిలోకి వస్తాయని, ఆ విషయంలో అధికారులతో మాట్లాడుతున్నట్లు ఆమె చెప్పారు. రోడ్డు పూర్తయితే డివైడర్, పూల మొక్కలు నాటుతామని, అదేవిధంగా సెంటర్ లైటింగ్ రైల్వే స్టేషన్ వరకు ఉన్న రోడ్డులో ఏర్పాటు చేస్తామని అన్నారు. వ్యాపారపరంగా కూడా ఇంద్ర పార్క్, కోట మైసమ్మ రోడ్డు పక్కనే ఉన్న చిన్న వ్యాపారులకు ఆర్థికపరంగా కొంత లాభం జరుగుతుందన్నారు.